పతనమైన టమోటా ధర

గుర్రంకొండ, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): టమోటా ధరలు రోజురోజుకు పతనమవుతుండడంతో రైతన్నలు ఆందోళన చెందుతున్నారు. దీంతో టమోటాలను రైతులు తోటలోనే వదిలేసే దుస్థితి నెలకొంది. బయట రాష్ట్రాల్లో టమోటాల దిగుబడి ఎక్కువగా ఉండడంతో పాటు మార్కెట్‌కు వ్యాపారులు రావడం లేదు. దీంతో టమోటాల ధరలు పడిపోయాయి. గుర్రంకొండ మార్కెట్ యార్డులో గురువారం కిలో టమోటా ధర రూ.8 చేరింది. ఈ లెక్కన 25 కిలోల టమోటా క్రేట్ ధర రూ.200 పలికింది. టమోటా ధరలు తగ్గుముఖం పట్టడంతో పంట సాగు చేసిన రైతన్నలు ఆందోళన చెందుతున్నారు. అంతేకాకుండా ఈనెల చివరన టమోటా కోతలు ప్రారంభమయ్యే రైతులు ధరలు పెరగకపోతాయా అని ఎదురుచూస్తున్నారు.

● కిలో రూ.8



గుర్రంకొండ మార్కెట్‌లో టమోటాలను గ్రేడింగ్ చేస్తున్న కూలీలు

ఉపాధి పనులు చేస్తున్న కూలీలు



ఉపాధి బిల్లులు ఎప్పుడిస్తారో..?

● మూడు నెలలుగా ఎదురుచూపులు
● పనులకు ముఖం చాటేస్తున్న కూలీలు



(రాయచోటి-ఆంధ్రజ్యోతి): జిల్లాలో మూడు నెలలుగా ఉపాధి హామీ పథకంలో పనులు చేసిన కూలీలు బిల్లులు రాకపోవడంతో చాలా మంది కూలీలు ఉపాధి పనులకు వెళ్లకుండా ఇతర పనులకు వెళుతున్నారు. ఇలాగే ఇంకా కొన్ని రోజులు బిల్లులు పడకపోతే కూలీల సంఖ్య మరింత తగ్గి కూలి పనుల కోసం పట్టణాలకు వలసలు వెళ్లే ప్రమాదముంది. ఉపాధి హామీ పథకం పనులు జిల్లాలో కరువు ప్రాంత మండలాల్లో రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయి. ఈ పథకం ద్వారా సిమెంటు రోడ్లు, చెరువుల్లో పూడికతీత పనులే కాకుండా గోకులం షెడ్లు, ఫారంపాండ్లు, రింగ్‌ట్రెంచ్‌లు, రైతుల పొలాల్లో సరిహద్దు గుంతలు, కందకాలు తవ్వడం, పండ్ల తోటల పెంపకం వంటి పనులు చేయడం వల్ల రైతులకు ఉపయోగంతో పాటు ఎక్కువ మంది కూలీలు ఈ పనులకు హాజరవుతున్నారు. ఇప్పటికే జిల్లాలోని పలు మండలాల్లో వర్షాలు తగినంత పడలేదు. దీంతో పంటలు సాగవలేదు. వేల ఎకరాలు బీళ్లుగా ఉన్నాయి. ఏ పల్లెలో చూసినా రైతులు, కూలీలు పనులు లేక ఇళ్ల వద్ద ఖాళీగా ఉంటున్నారు. ఇటువంటి పరిస్థితుల్లో ఉపాధి పనులు జిల్లాలో ముఖ్యంగా రాయచోటి, తంబళ్లపల్లె, పీలేరు నియోజకవర్గాల్లోని రైతులను ఆదుకుంటున్నాయని చెప్పవచ్చు. ఈ నేపథ్యంలో ఈ ఏడాది జనవరి నుంచి చూస్తే జిల్లాలో జరుగుతున్న ఉపాధి పనుల్లో పెద్ద ఎత్తున కూలీలు పాల్గొంటున్నారు. పెద్దతిప్పసముద్రం మండలంలో ఉపాధి హామీ పథకానికి సంబంధించి 6217 జాబ్‌కార్డులకు గాను 5110 యాక్టివ్‌గా ఉన్నాయి. మండలంలో వివిధ గ్రామాలలో చేపట్టిన గోకులం షెడ్‌లు, ఫారంపాండ్లు, చెరువుల్లో పూడికతీత పనులు, రింగుట్రెంచ్‌లు, కందకాలు, రైతుల పొలాల్లో బౌండరీ ట్రెంచులు, ఉపాధి హామీలో పండ్లతోటల పెంపకం, చెరువుల పూడికతీత పనులకు 20 పంచాయతీలలో 2025-26 సంవత్సరానికి రెండు లక్షల నలభై వేల రూపాయల నిధులు విడుదలయ్యాయి. స్థానికంగా కరువు పనులుగా పిలుచుకునే ఉపాధి పనులు ఎక్కువగా రాయచోటి, తంబళ్లపల్లె, పీలేరు నియోజకవర్గాల పరిధిలో జరుగుతున్నాయి.

రూ.37.23 కోట్ల బిల్లుల బకాయిలు

జిల్లాలోని 30 మండలాల్లో ఈ ఏడాది జనవరి 15 నుంచి ఇప్పటి వరకు ఉపాధి హామీ పనులకు బిల్లులు పడలేదు. రూ.37.23 కోట్ల బిల్లులు బకాయి ఉన్నాయి. జనవరి 15 నుంచి చివరి వరకు రూ.3,58,81,398 బిల్లులు బకాయిలు ఉన్నాయి. ఫిబ్రవరిలో రూ.16,27,62,080, మార్చిలో 12,88,73,420 రూపాయల బిల్లులు రావాల్సి ఉంది. ఏప్రిల్‌లో నేటి వరకు రూ4,48,01,075 బిల్లులు రావాల్సి ఉంది. గతంలో బిల్లులు సకాలంలో పడడంతో పనులకు హాజరయ్యే కూలీలు ఎక్కువగా ఉండి బిల్లులు కూడా ఎక్కువగానే ఉన్నాయి. ఫిబ్రవరిలో రూ.16 కోట్లకు పైగా, మార్చిలో రూ.12 కోట్లకు పైగా బిల్లులు ఉండడమే ఇందుకు నిదర్శనం. అయితే తర్వాత సక్రమంగా బిల్లులు పడకపోవడంతో ఏప్రిల్ ద్వితీయ వా రా ని కి కూడా రూ.4 కోట్ల వరకు మాత్రమే బిల్లులు ఉన్నాయి. దీనిని బట్టి బిల్లులు రాకపోవడంతో కూలీల సంఖ్య కూడా తగ్గుతోందని అర్థం చేసుకోవచ్చు.

జిల్లాలో బకాయిల విషయమై మండలాల వారీగా చూస్తే.. గత జనవరి నుంచి ఇప్పటి వరకు గరిష్ఠంగా రామాపురం మండలంలో రూ.మూడు కోట్ల 9 లక్షల పైగా బకాయిలు ఉన్నాయి. కనిష్ఠంగా కేవీ పల్లెలో రూ.30 లక్షలు ఉన్నాయి. చిన్నమండెం మండలంలో రూ.2.61 లక్షలు, గాలివీడు మండలంలో రూ.3 కోట్లకు పైగా, లక్కిరెడ్డిపల్లె మండలంలో రూ.కోటి 95 లక్షలకు పైగా, రాయచోటిలో రూ.కోటి 54 లక్షలు, సంబేపల్లె రూ.2.74 లక్షలు, సుండుపల్లెలో రూ.కోటి 99 లక్షలు, తంబళ్లపల్లెలో రూ.కోటి 30 లక్షలు, వాల్మీకిపురంలో రూ.కోటి 36 లక్షలు, వీరబల్లిలో రూ.కోటి 59 లక్షల బకాయిలు ఉన్నాయి. ఈ మండలాలు అన్నింటి లోనూ.. ఈ ఏడాది కరువు తీవ్రంగా ఉన్న విషయం గమనార్హం.

వారం పది రోజుల్లో బిల్లులు

బిల్లులు పడకపోవడంతో.. కూలీలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాము. కూలీల సంఖ్య కూడా తగ్గుతోంది. వారం పది రోజుల్లో బిల్లులు పడతాయి.

- వెంకటరత్నం, డ్వామా పీడీ

బిల్లులు వెంటనే ఇచ్చి ఆదుకోవాలి



చేసిన పనులకు బిల్లులు రాలేదు. ప్రతిరోజూ మండుటెండలో పనులు చేస్తున్నాము. వానలు లేక పంటల సాగు కాలేదు. ఇతర కూలీ పనులు కూడా దొరకడం లేదు. ఇటువంటి పరిస్థితుల్లో బిల్లులు రాకపోవడంతో చాలా ఇబ్బందిగా ఉంది. వెంటనే ప్రభుత్వం బిల్లులు ఇవ్వాలి.

- ఇందిరమ్మ, లక్కిరెడ్డిపల్లె

పదివేల ఎకరాల్లో పచ్చిమేత పెంపకం

● కలెక్టర్ చామకూరి శ్రీధర్



అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ చామకూరి శ్రీధర్

రాయచోటి(కలెక్టరేట్), ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పదివేల ఎకరాల్లో పచ్చి మేత (గ్రీన్ ఫాదర్) పెంపకానికి కృషి చేయాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం సాయంత్రం కలెక్టరేట్‌లోని వీసీ హాలు నుంచి సబ్ కలెక్టర్లు, ఆర్డీవో, తహసీల్దార్లు, డీఎల్డీవోలు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు తదితరులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఈ ఏడాది పది వేల ఎకరాల్లో పచ్చిమేత పెంపకం లక్ష్యంగా నిర్ణయించామన్నారు. ఖాళీగా వ్యవసాయ వినియోగం లేని భూములను నేపియర్ గడ్డి పెంపకానికి గుర్తించిన ఏజెన్సీకి లీజుకు ఇస్తే ఎకరాకు వార్షికంగా రూ.30 వేలు ఇస్తారని, దీనికి ప్రతి రెండు సంవత్సరాలకు ఐదు శాతం మేర పెంచడం కూడా జరుగుతుందన్నారు. ఈ విషయాన్ని రైతుల్లో విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు. ప్రతి మండలంలో మూడు నుంచి నాలుగు వేల ఎకరాలు లీజుకు ఇస్తే రైతులకు నికర ఆదాయం వస్తుందన్నారు. ప్రతి గ్రామంలో ప్రజలు, రైతులు, నాయకులకు గ్రామసభల ద్వారా ఈ విషయాన్ని అర్థమయ్యేలా వివరించాలన్నారు. పల్లెపండుగ కింద జిల్లాలో చేపట్టిన పనులన్నింటినీ ఈ మాసాంతంలోగా పూర్తి చేయాలన్నారు. వీసీలో సబ్ కలెక్టర్లు మేఘస్వరూప్, నిదియాదేవి, డీఆర్వో మధుసూదన్‌రావు, ఆర్డీవో శ్రీనివాసులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కానరా స్నేహం

పీలేరు, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): పెంపుడు జంతువుల్లో వానరం కూడా ఒకటి. చాలామంది సరదాగా వాటిని పెంచుకుంటూ ఉంటారు. తమను పెంచుకుంటున్న వారితో అవి స్నేహపూర్వకంగా ఉండడం మనం చూస్తుంటాం. అయితే అందరితోనూ సఖ్యతగా ఉండే వానరాన్ని చూడడం అరుదు. అటువంటి వానరం ఒకటి గురువారం పీలేరు ప్రభుత్వ ఆసుపత్రి ప్రాంగణంలోని క్యాంటీన్‌లో సందడి చేసింది. పీలేరు ఇందిరమ్మ కాలనీకి చెందిన శివ అనే యువకుడు ఓ వానరం పిల్లను పెంచుకుంటున్నాడు. వ్యక్తిగత పనుల నిమిత్తం బెంగళూరుకు వెళ్లాల్సి రావడంతో దానిని గురువారం ఉదయం ప్రభుత్వ ఆసుపత్రిలోని క్యాంటీన్‌లో వదిలి వెళ్లాడు. అయితే అది క్యాంటీన్‌కు వచ్చిన వాళ్లందరితోనూ స్నేహంగా ఉంటూ అందరి ఒళ్లలో ఒదిగిపోతూ అందరినీ ఆశ్చర్యపరిచింది. ఎవరు ఏమిచ్చినా తినడం, వారి ఒళ్లో పడుకోవడం వంటి పనులు చేస్తుండడంతో క్యాంటీన్‌కు వచ్చిన వాళ్లందరూ సరదాగా దాంతో కాసేపు గడిపారు.



నీరు తాగుతున్న వానరం

లాలిపాప్ తింటూ...

చిరుత మృతి ఘటనలో ఏడుగురిపై కేసు నమోదు

● ముగ్గురికి 14 రోజుల రిమాండ్ ● ప్రధాన గేటుకు తాళాలు వేసి రహస్య విచారణ



అటవీశాఖ కార్యాలయ ప్రధాన గేటుకు తాళాలు వేసి కాపలా ఉన్న సిబ్బంది



వైద్యపరీక్షల అనంతరం అనుమానితులను తరలిస్తున్న అటవీ శాఖాధికారులు

మదనపల్లె టౌన్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె మండలం పొన్నేటిపాళెం గ్రామం వద్ద చిరుత మృతి ఘటనలో ఏడుగురిపై కేసు నమోదు చేయగా ముగ్గురు అనుమానితులను అటవీ శాఖాధికారులు అదుపులోకి తీసుకున్నారు. గురువారం ఉదయమే పొన్నేటిపాళెం గ్రామానికి వెళ్లిన అటవీ శాఖాధికారులు రెడ్డెప్పరెడ్డి, వెంకటరమణారెడ్డి, గంగాధర్ అనే ముగ్గురిని అదుపులోకి తీసుకుని మదనపల్లె అటవీ శాఖ కార్యాలయానికి తీసుకెళ్లారని గ్రామస్థులు చెప్పారు. అటవీశాఖ కార్యాలయం ప్రధాన గేటుకు తాళాలు వేసిన సిబ్బంది లోనికి ఎవ్వరినీ అనుమతించలేదు. ఓ గదిలో ముగ్గురు అనుమానితులను రహస్యంగా విచారించినట్లు తెలిసింది. ఈ కేసులో ఇంకా ఎవరి పాత్ర ఉందనే వివరాలను సేకరించినట్లు తెలిసింది. కాగా అనుమానితులు ముగ్గురిని మదనపల్లె ప్రభుత్వాస్పత్రికి వైద్య పరీక్షలకు తీసుకొచ్చి, తరువాత తిరిగి అటవీ శాఖ కార్యాలయానికి తీసుకెళ్లారు. కాగా ముగ్గురిని కోర్టులో హాజరుపరచగా 14 రోజుల రిమాండ్ విధించారు. ఫారెస్టు రేంజర్ జయప్రసాదరావు ఆధ్వర్యంలో కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నిబంధనలను అనుసరించి విధులు నిర్వహించాం

- సబ్ డీఎఫ్‌వో శ్రీనివాసులు

వేటగాళ్ల ఉచ్చులో చిక్కుకున్న చిరుతను రక్షించడానికి శాయశక్తులా కృషి చేశామని, అటవీశాఖ నిబంధనలు అనుసరించి విధులు నిర్వహించామని సబ్ డీఎఫ్‌వో శ్రీనివాసులు తెలిపారు. గురువారం స్థానిక రేంజర్ కార్యాలయంలో ఆయన రేంజర్ జయప్రసాదరావు, డీఆర్‌వో మదనమోహన్, సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొన్నేటిపాళెంలో ఇటీవల ఒక లేగదూడపై చిరుత దాడి చేసినట్లు తమ ప్రాథమిక విచారణలో తేలిందన్నారు. ఈ క్రమంలోనే కొందరు చిరుతను చంపేయాలని జీఐ తీగలతో ఉచ్చు వేశారని, అది కూడా ఉచ్చులో చిరుత పడుతూనే కిందవైపు ఉన్న పల్లంలో పడిపోయే విధంగా పెద్ద కట్టినాటారన్నారు. స్టాండర్డ్ ఆఫ్ ప్రొసీజర్ ప్రకారమే తాము నడుచుకున్నామన్నారు. గ్రామాల వైపు చిరుత సంచారం ఆనవాళ్లు ఉంటే అటవీశాఖ అధికారులకు తెలపాలే కాని, వారే చట్టాన్ని చేతుల్లోకి తీసుకోరాదన్నారు. చిరుత ఒకేచోట ఉండదని, ప్రతి రోజు 20 నుంచి 50 కిలోమీటర్ల దూరం ప్రయాణిస్తుందని, హార్సిలీహిల్స్, నిమ్మనపల్లె, చీకిలబైలు చిట్టడవుల్లోనే ఎక్కువగా తిరుగుతుంటాయన్నారు. వీటి సంచారంపై గ్రామాల్లో కళాజాతలు నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు.


అమెరికా సదస్సుకు 'పోర్డు' లలితమ్మ



మదనపల్లె టౌన్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): అమెరికాలోని సీఆర్‌వై సంస్థ నిర్వహిస్తున్న బాలల హక్కుల సదస్సుకు మదనపల్లెకు చెందిన పోర్డు సంస్థ డైరెక్టర్ జె.లలితమ్మకు అహ్వానం అందింది. ఈ సందర్భంగా గురువారం లలితమ్మ మాట్లాడుతూ అమెరికాలోని ఆరు రాష్ట్రాల్లో 15 రోజుల పాటు నిర్వహించే సదస్సుల్లో పద్మభూషణ్ అవార్డు గ్రహీత షబానాఅజ్మీ పాల్గొనున్నారన్నారు. ఈ సదస్సులకు తనకు అహ్వానం అందిందని, గతంలో కూడా తాను అమెరికాలో నిర్వహించిన సదస్సుల్లో పాల్గొన్నానన్నారు. ఈనెల 22 నుంచి మే 6వ తేదీ వరకు బాలల హక్కులపై తాను ప్రసంగించనున్నట్లు లలితమ్మ పేర్కొన్నారు.

అటవీశాఖ నిబంధనలే కారణమా..?

● కాలయాపనతో చిరుత మృతి
● తుప్పుపట్టి పనిచేయని షాట్‌గన్
● వన్యప్రాణుల రక్షణకు సరైన పరికరాలు లేవు...



వేటగాళ్ల ఉచ్చులో చిక్కుకుని మృతి చెందిన చిరుత (ఫైల్)

మదనపల్లె టౌన్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె మండలంలో వేటగాళ్ల ఉచ్చులో చిక్కుకున్న చిరుతను అటవీశాఖ అధికారుల అలసత్వంతోనే రక్షించలేకపోయారని పలువురు సబ్‌కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తుండగా, తాము నిబంధనల మేరకే చిరుతను రక్షించడానికి ప్రయత్నించామని సబ్ డీఎఫ్‌వో చెబుతున్నారు. 1972 వన్యప్రాణి సంరక్షణ చట్టం ప్రకారం ఉచ్చులో చిక్కుకున్న చిరుతను కాపాడటానికి తిరుపతి జూ పార్కు నుంచి నిపుణులు మాత్రమే వచ్చి కాపాడాలని, అది కూడా ట్రాంకిలైజర్స్ గన్‌తో, బోనులు పెట్టి చిరుతను రక్షించాలని నిబంధనలు చెబుతున్నాయని అటవీశాఖ అధికారులు వ్యాఖ్యానిస్తున్నారు. వాస్తవంగా తిరుపతి నుంచి జూపార్కు నిపుణులు మదనపల్లె మండలంలోని సంఘటనా స్థలానికి చేరుకోవడానికి 3 గంటల సమయం సరిపోతుంది. కానీ వారికి ఉదయం 10.30 గంటలకు ఈ సమాచారం అందినట్లు తెలిసింది. వారు ప్రత్యేక వాహనంలో మదనపల్లెకు చేరుకునే సరికి మధ్యాహ్నం 1.30 గంటలు కావడం, అంతలోపే 12.30 గంటలకు చిరుత మృతి చెందడం చర్చనీయాంశంగా మారింది.

సకాలంలో స్పందించి ఉంటే..?

పొన్నేటిపాళెం గ్రామం వద్ద వేటగాళ్ల ఉచ్చులో చిరుత పడిందని ఉదయం 4 గంటలకే ఆ గ్రామస్థులు గుర్తించారు. ఈ విషయమై పొన్నేటిపాళెం వీఆర్‌వో నారాయణకు సమాచారం అందించారు. దీంతో వీఆర్‌వో నారాయణ పట్టణంలోని అటవీ శాఖ రేంజర్ జయప్రసాదరావు ఇంటికి ఉదయం 8.15 గంటలకే వెళ్లి చిరుత ఉచ్చులో చిక్కుకున్న విషయమై సమాచారం అందించారు. ఈ క్రమంలో ఉదయం 8.40 గంటలకు రేంజర్ తన సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని ఉన్న పరిస్థితిని సబ్ డీఎఫ్‌వోకు ఫోన్‌లో సమాచారం అందించారు. సబ్ డీఎఫ్‌వో శ్రీనివాసులు 9.40 గంటలకు సంఘటనా స్థలానికి చేరుకుని చిరుతను రక్షించే విషయమై డీఎఫ్‌వో జగన్నాథసింగ్, ఫారెస్ట్ కన్సర్వేటర్‌కు ఉదయం 10.10కు ఫోన్‌లో సమాచారం ఇచ్చారు. ఈ తతంగం అంతా నడిచే సరికి చిరుతను రక్షించే సమయం వృథా అయింది. జూ పార్కు నిపుణులు 10.30 గంటలకు బయలు దేరి మదనపల్లె రావడానికి ఆలస్యం కావడం, అప్పటికే చిరుత మృతి చెందడం జరిగింది.

వన్యప్రాణుల రక్షణకు సరైన పరికరాలు లేవు...

జిల్లాలోని నాలుగు రేంజ్‌లలో వన్యప్రాణుల రక్షణకు అటవీ శాఖ అధికారుల వద్ద సరైన పరికరాలు లేవంటే అతిశయోక్తి కాదు. సాధారణంగా వేసవిలో అడవుల్లో తాగునీరు లేనప్పుడు వన్యప్రాణులు సమీప గ్రామాల సరిహద్దుల్లోని నీటి కుంటలపై ఆధారపడతాయి. రాత్రిళ్లు జనసంచారం లేనప్పుడు వచ్చి దాహార్తి తీర్చుకుని వెళుతాయి. కొన్ని మాంసాహార జంతువులు అటవీ సమీప గ్రామాల్లోకి వచ్చి మేకలు, కుక్కలు, లేగదూడలపై దాడి చేసి వాటిని తీసుకెళ్తాయి. ఈ క్రమంలో ఒక్కోసారి పాడుబడిన బావుల్లో వన్యప్రాణులు పడిపోతున్నాయి. అంతేకాకుండా అడవి పందుల కోసం వేటగాళ్లు వేసే ఉచ్చులో చిక్కుకుని అల్లాడుతుంటాయి. ఈ కోవలోనే బుధవారం ఉచ్చులో చిరుత చిక్కుకుని చనిపోయింది. కాగా ఇలా చిక్కుకున్న జంతువులను కాపాడటానికి అటవీశాఖ అధికారుల చేతిలో సరైన పరికరాలు కూడా లేవు. కనీసం వలలు, పొడవైన తాడులు, క్రూరమృగాల నుంచి ప్రాణ రక్షణకు ట్రాంకిలైజర్ గన్స్ లేవు. ఒట్టి చేతుల్తో వెళ్తే సిబ్బంది ప్రాణాలకు ప్రమాదం, అలా అని వదిలేస్తే వన్యప్రాణుల ప్రాణాలకు ప్రమాదం.

తిరుపతి జూ పార్కుపై ఆధారపడుతున్న నాలుగు జిల్లాలు

రాయలసీమలోని కడప, అన్నమయ్య, చిత్తూరు, నెల్లూరు జిల్లాలో అటవీ శాఖ అధికారులు ప్రమాదాల్లో చిక్కుకున్న ఏనుగులు, చిరుతలు, క్రూరమృగాలను రక్షించడానికి తిరుపతి జూపార్కు అధికారులపైనే ఆధారపడుతున్నారు. తిరుపతి అటవీశాఖ కన్సర్వేటర్ సర్కిల్‌లోని జూపార్కులోనే ఈ సదుపాయం ఉండటంతో ఎటు వైపు వెళ్లాలన్నా కనీసం 3 నుంచి 5 గంటల సమయం పడుతోంది. దీంతో అరుదైన వన్యప్రాణుల ప్రాణాలు గాల్లో కలసిపోతున్నాయి. ఈ విషయమై రాష్ట్ర అటవీశాఖ పరిశీలించి దీర్ఘకాలంగా ఉన్న ఈ సమస్యను పరిష్కరించాల్సి ఉంది.

చిరుత మృతిపై స్పందించిన డిప్యూటీ సీఎం

● నేడు మదనపల్లెకు పీసీసీఎఫ్ రాక
● చిరుత మృతికి కారణాలపై విచారణ

మదనపల్లె టౌన్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె మండలం పొన్నేటిపాళెం గ్రామం వద్ద చిరుత వేటగాళ్ల ఉచ్చులో చిక్కుకుని మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ చిరుతను ఉచ్చు నుంచి రక్షించడానికి నిబంధనల పేరిట అటవీ శాఖ అధికారులు అలసత్వం ప్రదర్శించారని పలు విమర్శలు వచ్చాయి. 8 గంటల పాటు నరకయాతన పడిన చిరుత సొమ్మసిల్లి మృతి చెందడం, చిరుత గర్భంలోని రెండు మగ కూనలు కూడా మృతి చెందడంపై దినపత్రికల్లో, టీవీ చానెళ్లలో వార్తలు ప్రచురితం అయ్యాయి. అంతేకాకుండా పలువురు వన్యప్రాణుల, మూగ జీవాల శ్రేయోభిలాషులు ఈ విషయమై రాష్ట్ర అటవీశాఖ మంత్రి పవన్‌కళ్యాణ్‌కు సామాజిక మాధ్యమాల ద్వారా ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన డిప్యూటీ సీఎం ప్రిన్సిపల్ చీఫ్ కన్సర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ (పీసీసీఎఫ్) చలపతి రావును మదనపల్లె వెళ్లాల్సిందిగా ఆదేశించారు. ఈ క్రమంలో ఆయన విజయవాడ నుంచి బయలుదేరి గురువారం రాత్రి తిరుపతి చేరుకున్నారు. శుక్రవారం మదనపల్లెలో అటవీశాఖ అధికారులను విచారించడంతో పాటు, పొన్నేటిపాళెం గ్రామం వద్ద చిరుత మృతి చెందిన ప్రాంతాన్ని పరిశీలించి, గ్రామస్థుల నుంచి వివరాలను సేకరించనున్నారు. పీసీసీఎఫ్ స్వయంగా విచారణకు వస్తుండటంతో అటవీశాఖ అధికారులు బిక్కుబిక్కుమంటున్నారని తెలిసింది.

తుప్పు పట్టి పనిచేయని షాట్ గన్

చిరుతను కాపాడటానికి, దానికి మత్తు మందు ఇచ్చేందుకు మదనపల్లె అటవీశాఖ అధికారులు ఎక్కడి నుంచో ఒక షాట్‌గన్ తీసుకొచ్చారు. ఈ గన్‌లోకి మత్తు ఇంజెక్షన్ ఇచ్చేందుకు బ్యారెల్‌ను తెరిచేందుకు ప్రయత్నించినా అది తెరుచుకోలేదు. తుప్పు పట్టి ఉన్న ఈ గన్ తీసుకొచ్చినా పనిచేయకపోవడంతో అటవీశాఖ అధికారుల ప్రయత్నం విఫలమైంది.



సంఘటనా స్థలంలో షాట్ గన్ బ్యారెల్ తెరిచేందుకు ప్రయత్నిస్తున్న అటవీ అధికారులు (ఫైల్)

ఒకటిన్నర ఎకరం.. ఆరు పంటలు

● మిరప, కాలిఫ్లవర్, బొప్పాయి, చీనీ అంట్లు, టమోట, ఉల్లిపాయల సాగు చేసిన రైతు


రైల్వేకోడూరు, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): ఓ రైతు ఒకటిన్నర ఎకరం పొలంలో ఆరు పంటలు సాగు చేశాడు. దున్నకాలు తప్ప అన్ని యాజమాన్య పద్ధతులను తానే స్వయంగా చూసుకుంటూ సాగు చేస్తున్నాడు. మండలంలోని బయనపల్లె గ్రామానికి చెందిన కూకట్ల సుబ్బరాయుడు అనే రైతు తనకు ఉన్న ఒకటిన్నర ఎకరం పొలంలో మిరప, కాలిఫ్లవర్, బొప్పాయి, చీనీ అంట్లు, టమోట, ఉల్లిపాయలు సాగు చేస్తున్నాడు. ఒకే పొలంలో అన్ని రకాల పంటలను సాగు చేయడం లక్ష్యంగా పెట్టుకున్నాడు. ఆరు పంటలు వేసినందు వల్ల ఒక దాంట్లో కాకున్నా మరొక పంటలో ఆదాయం




టమోటా, ఉల్లి సాగు

వస్తుందనే ఆలోచనతో ఆరు పంటలను వేశాడు. ఉల్లిపాయలు గట్టు మీద ఎనిమిది వరసలు వేశారు. 20 సెంట్లలో మిరప, 30 సెంట్లలో కాలిఫ్లవర్, 40 సెంట్లలో చీనీ నిమ్మ అంట్లు, 10 సెంట్లలో టమోట, మిగిలిన ఎకరా భూమిలో బొప్పాయి పంట సాగు చేస్తున్నాడు. 20 రోజుల్లో కాలిఫ్లవర్ కోతకు వస్తుంది. అదే విధంగా మిరప 15 రోజుల్లో కోతకు వస్తుంది. టమోటా ప్రస్తుతం కోత దశలో ఉంది. ఉల్లిపాయలు 20 రోజుల్లో కోత దశకు వస్తాయి. చీనీ నిమ్మ అంట్లు 50 రోజుల్లో ఇతర ప్రాంతాలకు ఎగుమతి చేసే విధంగా వస్తాయి.

ఒకే పంట వేస్తే ఆదాయం రాదని ...



ఒకే పంటను వేస్తే ఆదాయం రాదని తెలుసుకుని ఆరు పంటలు వేశాను. బొప్పాయి పంటను ఒకటిన్నర ఎకరంలో వేస్తే తెగుళ్లు రావచ్చు, దిగుబడి రాకుండా ఉండవచ్చు, ధరలు లేకుండా ఉండ వచ్చు ఇలా ఏదైనా జరగవచ్చునని ఆలోచించి ఆరు రకాల పంటలను వేశాను. ఒకటి కాకున్నా మరొకటి లాభాన్ని చేకూర్చుతుంది.

- కూకట్ల సుబ్బరాయుడు, ఆరు పంటల రైతు, బయనపల్లె



సాగులో ఉన్న కాలిఫ్లవర్



మిరప



చీనీ అంట్లు



బొప్పాయి

వంద శాతం లక్ష్యాన్ని పూర్తి చేయాలి

వేగవంతంగా సోలార్ ప్రాజెక్టుల భూసేకరణ : కలెక్టర్ చామకూరి శ్రీధర్

రాయచోటి (కలెక్టరేట్), ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పథకాల ప్రగతి సాధనలో వంద శాతం లక్ష్యాలను పూర్తి చేయాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం విజయవాడ ఏపీ సచివాలయంలోని సీఎస్ కాన్ఫరెన్స్ హాల్ నుంచి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. రాయచోటి కలెక్టరేట్ నుంచి కలెక్టర్‌తో పాటు డీఆర్వో మధుసూదన్‌రావు తదితరులు పాల్గొన్నారు. వీసీ అనంతరం అధికారులతో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఈనెల 19వ తేదీ మూడవ శనివారం స్వర్ణ ఆంధ్ర- స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాలను పటిష్టంగా నిర్వహించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఉచిత ఇసుక పథకంలో భాగంగా జిల్లా అవసరాలకు తగినంత ఇసుక నిల్వలను సిద్ధం చేసుకోవాలన్నారు. పీఎం కుసుమ్ కార్యక్రమం ద్వారా జిల్లాలో సోలార్ ప్రాజెక్టుకు అవసరమైన భూసేకరణను వేగవంతంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. వేసవిలో జిల్లాలో ఎక్కడ కూడా తాగునీటి ఎద్దడి తలెత్తకుండా అధికారులు ముందస్తుగా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. జిల్లాలో చేపట్టిన ఎంఎస్ఎంఈల సర్వేను పటిష్టంగా నిర్వహించాలన్నారు. ఉద్యం డేటా, ఎంఎస్ఎంఈ డేటా తేడాలు ఉండరాదన్నారు. అనంతరం వివిధ అంశాల్లో తగు సూచనలు జారీ చేశారు. సమావేశంలో సంబంధిత జిల్లా అధికారులు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్

పరీక్షలు, మార్కులే జీవితం కాదు

కస్తూర్బా విద్యార్థినుల అవగాహన కార్యక్రమంలో డీఈవో సుబ్రమణ్యం

రాయచోటిటౌన్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు పరీక్షలు, మార్కులే జీవితం కాదని, బాలికలు అన్నింటిలో ఆత్మ విశ్వాసంతో ముందుకు నడవాలని డీఈవో డాక్టర్ సుబ్రమణ్యం తెలిపారు. గురువారం రాయచోటి పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జిల్లా పరిధిలోని మదనపల్లె డివిజన్‌లో గల కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయ విద్యార్థినులు, వారి తల్లిదండ్రులకు సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో జిల్లా జీసీడీవో మధుమతి అధ్యక్షతన పరీక్షలు, మార్కులే జీవితమా..? అనే అంశంపై కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి సమాజంలో పరీక్షలు మార్కులే జీవితం అనుకోకుండా ఇతర ఎన్నో రకాల రంగాల్లో విద్యార్థులు రాణిస్తూ ముందుకు నడవాలన్నారు. మానసిక వైద్య నిపుణులు రాధిక మాట్లాడుతూ ఇటీవల కాలంలో పరీక్షల్లో మార్కులు తక్కువ వచ్చాయని, ఉత్తీర్ణత సాధించలేదన్న వివిధ కారణాలతో కొంత మంది విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని, అది చాలా తప్పు అన్నారు. ప్రముఖ మోటివేషన్ స్పీకర్, పోలీసు అధికారి రాంమూర్తి మాట్లాడుతూ పదవ తరగతి పరీక్షా ఫలితాలే విద్యార్థుల అంతిమ లక్ష్యం కారాదని, బాలికలు ఆత్మవిశ్వాసంతో ముందుకెళితే ఉత్తమ ఫలితాలు సాధ్యమవుతాయన్నారు. సైక్రియాట్రిక్ సోషల్ వర్కర్ డాక్టర్ గౌతమి, ఫోర్డ్ సంస్థ సభ్యురాలు సుబాషిణి, సమగ్ర శిక్ష పూర్వ సెక్టోరల్ ఆఫీసర్ పఠాన్ మహమ్మద్‌ఖాన్, కేజీబీవీ ప్రిన్సిపాల్స్ బాలికలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీఈవో సుబ్రమణ్యం

రూ.350 వేతనం వచ్చేలా పనిచేయాలి

● డ్వామా పీడీ వెంకటరత్నం

రామాపురం, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): రోజువారీ వేతనం రూ.350 వచ్చేలా ఉపాధి కూలీలు పనిచేయాలని పీడీ వెంకటరత్నం అన్నారు. మండలంలోని హసనాపురం పంచాయతీలో గురువారం ఉపాధి హామీ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా రైతు నీటికుంట పనులు, పశువుల నీటితొట్టెలు, పశుగ్రాసం, హార్టికల్చర్ పనులను పరిశీలించారు. 3 నెలలుగా డబ్బు రాలేదని కూలీలు పీడీ దృష్టికి తీసుకురాగా త్వరలో వస్తాయని తెలిపారు. రూ.350 రోజు వారి వేతనం వచ్చేలా కూలీలచే పనిచేయించాలని అధికారులకు సూచించారు. రైతులకు హార్టికల్చర్, పశువుల నీటి తొట్టె పనులు, ఉపాధి హామీ పథకం కింద మంజూరు చేస్తామని రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. మండలంలో మంజూరైన ఫారంపాండ్స్, పశువుల నీటి తొట్టె పనులు ఈనెల చివరికి పూర్తి చేయాలని సిబ్బందిని ఆదేశించారు. ఈయన వెంట లక్ష్మీనరసయ్య, ఏపీవో పెంచలయ్య, ఈసీ ఓబులేసు, టీఏ చంద్రశేఖర్, ఫీల్డ్ అసిస్టెంట్లు రవిశంకర్‌రెడ్డి, పక్కీర్‌రెడ్డి, అల్లా బకష్‌లు పాల్గొన్నారు.



ఉపాధి పనులను పరిశీలిస్తున్న పీడీ వెంకటరత్నం

కేక్ తిని ఐదుగురు చిన్నారులకు అస్వస్థత

రామసముద్రం, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): రామసముద్రం మండల కేంద్రంలోని ఓ బేకరీలోని హనీ కేక్ తిని ఐదుగురు చిన్నారులు అస్వస్థతకు గురయ్యారు. మండల కేంద్రంలోని ఆంజనేయస్వామి కాలనీకి చెందిన సుధీర్ (11), మధుశ్రీ (9), దర్శన్ (8), భవ్య (5), శ్రీధర్ (2) అస్వస్థత గురై వాంతులు చేసుకున్నారు. వీరికి కుటుంబ సభ్యులు పుంగనూరు ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నారు. పిల్లల పరిస్థితి నిలకడగా ఉన్నట్లు సమాచారం. ఈ విషయమై బేకరీ యజమాని మాట్లాడుతూ హనీ కేక్‌ను ఉదయం ఎనిమిది గంటలకు తీసుకెళ్లారని, కానీ సాయంత్రం 6 గంటలకు పిల్లలు అస్వస్థతకు గురి కావడంతో ఏమీ జరిగిందో తెలియడం లేదని చెప్పారు.



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న చిన్నారులు

పెండింగ్ కేసులు త్వరితగతిన పరిష్కరించాలి

● ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు

రాయచోటిటౌన్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): పెండింగ్ కేసులను వేగవంతంగా పరిష్కరించడమే కాకుండా నిషేధిత మత్తు పదార్థాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు పోలీసు అధికారులకు సూచించారు. గురువారం జిల్లా పోలీసు కార్యాలయంలో రాయచోటి సబ్ డివిజన్ పరిధిలోని పోలీసు అధికారులతో నెలవారీ నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న కేసులపై నిశితంగా సమీక్ష జరిపి పోలీసు అధికారులకు పలు సూచనలు చేశారు. గంజాయి రవాణా, విక్రయాలపై దాడులు చేయాలని ఆదేశించారు. క్రికెట్ బెట్టింగ్, జూదం జిల్లాలో ఎక్కడా జరగకుండా కఠినంగా వ్యవహరించాలని ఆదేశించారు. చైన్ స్నాచింగ్‌లు జరగకుండా తగిన చర్యలు తీసుకోవాలని, గతంలో చైన్ స్నా చింగ్‌కు పాల్పడిన నేరస్థులపై నిఘా ఉంచాలన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎం.వెంకటాద్రి, రాయచోటి సబ్ డివిజన్ పరిధిలోని సీఐలు, ఎస్‌ఐలు సంబంధిత పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్పీ

ఉన్నతమైన లక్ష్యం నిర్దేశించుకోవాలి

● అసిస్టెంట్ ప్రొఫెసర్ సుభాషిణి

పీలేరు రూరల్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి); ఉజ్వల భవిత కోసం విద్యార్థులు ఉన్నతమైన లక్ష్యాలు నిర్ధేశించుకోవాలని తిరుపతి పద్మావతి మహిళా యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ యర్రదొడ్డి సుభాషిణి తెలిపారు. గురువారం పీలేరు బాలికల ఉన్నత పాఠశాలలో 2023-24 విద్యాసంవత్సరం పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో తెలుగులో 99 శాతం మార్కులు సాధించి ప్రథమ స్థానంలో నిలిచిన పి.నందినికి బంగారు పతకం, ప్రశంసాపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ 1993వ సంవత్సరంలో ఇదే పాఠశాలలో పదవ తరగతి చదవడం వల్లే తాను ఆరోజు ఈ స్థాయికి చేరానని తెలిపారు. తన తల్లిదండ్రులు చందన, కృష్ణారెడ్డిల జ్ఞాపకార్థం ఏటా తెలుగులో ప్రథమ స్థానం సాధించిన విద్యార్థినికి బంగారు పతకంతో పాటు ప్రశంసాపత్రం అందచేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం ఫౌజియా బేగం, ఉపాధ్యాయులు జానం సుజాత, గంగయ్య, శ్రీకళ, ఉమామహేశ్వరి, రెడ్డిదీపారాణి, ఇంద్రాణి, ప్రసన్నలక్ష్మి, రాధారాణి, శైలజ విద్యార్థులు పాల్గొన్నారు.



నందినికి బంగారు పతకం అందజేస్తున్న సుభాషిణి

రోడ్డు ప్రమాదంలో ద్విచక్ర వాహనం దగ్ధం

నిమ్మనపల్లి, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొనడంతో ఒకరికి గాయాలు కాగా ద్విచక్రవాహనానికి మంటలు చెలరేగి పూర్తిగా కాలిపోయింది. పోలీసుల కథనం మేరకు.. రామసముద్రం మండలం చెంబకూరుకు చెందిన హరీష్‌కుమార్‌రెడ్డి గురువారం తన ద్విచక్ర వాహనంపై నిమ్మనపల్లికు వస్తుండగా ముష్టూరు పంచాయతీ చల్లావారిపల్లి సమీపంలో మదనపల్లి మండలం కొత్తఇండ్లకు చెందిన గురువంశీ మదనపల్లికి వెళుతుండగా రెండు వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో హరీష్‌కుమార్‌రెడ్డికి గాయాలు కాగా అతడిని 108 వాహనంలో మదనపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. హరీష్‌కుమార్‌రెడ్డికి చెందిన ద్విచక్రవాహనం కింద పడడంతో మంటలు చెలరేగి పూర్తిగా కాలిపోయింది. విషయం తెలుసుకొన్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు.



కాలిపోతున్న ద్విచక్రవాహనం

భర్త, అత్తపై వరకట్నం వేధింపుల కేసు

రామసముద్రం, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): వరకట్నం తీసుకురావాలని భర్త సునీల్‌ప్రతాప్, అత్త గంగులమ్మ తనను వేధిస్తున్నారని లావణ్య గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ కథనం మేరకు.. మండలంలోని మాలేనత్తం పంచాయతీ ఎర్రపసెట్టిపల్లెకు చెందిన బూవిగాళ్ల నారాయణప్ప కుమార్తె లావణ్య (23)కు పెద్దపంజాణి మండలానికి చెందిన సునీల్‌ప్రతాప్‌తో వివాహమైంది. అయితే భర్త, అత్త తనను వరకట్నం తీసుకురావాలని వేధిస్తున్నారని లావణ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

31లోపు ఈకేవైసీ చేసుకోండి

మదనపల్లె అర్బన్, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): ఈనెల 31వ తేదీలోపు రేషన్ కార్డుదారులు ఈకేవైసీ చేసుకోవాని మదనపల్లె సీఎస్ డీటీ ఫిరోజ్‌ఖాన్ తెలిపారు. గురువారం తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్వోలు, ఎండీయూలతో సమావేశం నిర్వహించారు. ఆయా రేషన్ డీలర్ల పరిధిలో ఉన్న కార్డుదారులందరూ ఈకేవైసీ చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో గోడౌమ్ డీటీ సుబ్రహమ్మణ్యం, రేషన్ డీల్లర్ల అధ్యక్షుడు ఇమామ్‌ఖాసీమ్, డీలర్లు పాల్గొన్నారు.

80 శాతం సబ్సిడీతో డ్రోన్లు మంజూరు

● వ్యవసాయాధికారి చంద్రానాయక్

రాయచోటి (కలెక్టరేట్), ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): 80 శాతం సబ్సిడీతో ప్రభుత్వం రైతు సంఘాలకు డ్రోన్లను అందిస్తోందని వాటిని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వ్యవసాయశాఖ అధికారి చంద్రనాయక్ తెలిపారు. కిసాన్ డ్రోన్లపై జిల్లా స్థాయి వర్క్‌షాప్ గురువారం కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ అధికారి కిసాన్ డ్రోన్ పథకం మార్గదర్శకాలను వివరించారు. ప్రభుత్వం రైతు సంఘాలకు 80 శాతం సబ్సిడీపై డ్రోన్లను అందిస్తోందని, రైతులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. డ్రోన్‌లు ఉపయోగించడం వల్ల పురుగు మందుల పిచికారీ ఖర్చు తగ్గడంతో పాటు ఎకరం పిచికారీ 10 నిమిషాల్లో పూర్తవుతుందన్నారు. జిల్లాకు 34 డ్రోన్లు మంజూరయ్యాయని, రైతు సంఘాలు తమ గ్రూపు ఖాతాలో 50 శాతం జమ చేస్తే బ్యాంకులు 50 శాతం రుణం జారీ మంజూరు చేస్తాయని చెప్పారు. డ్రోన్ గ్రౌండింగ్ తర్వాత ప్రభుత్వం రైతు గ్రూప్ ఖాతాకు 80 శాతం సబ్సిడీని విడుదల చేస్తుందన్నారు. రైతు సంఘాలకు రుణాలు మంజూరు చేయడానికి యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సిద్ధంగా ఉందని తెలిపారు. డ్రోగో డ్రోన్స్, విహంగా డ్రోన్ల కంపెనీల ప్రతినిధులు తమ డ్రోన్ల ప్రత్యేకతలను వివరించారు. కార్యక్రమంలో ఎల్‌డీఎం ఆంజనేయులు, యూనియన్ బ్యాంక్ మేనేజర్ పి.ప్రసాద్ పాల్గొన్నారు.



డ్రోన్ వినియోగంపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

రూ.11 కోట్ల నష్టాల్లో పీలేరు ఆర్టీసీ

● నష్టాల సాకుతో 31 సర్వీసులు రద్దు ● హైదరాబాద్, విజయవాడ, చెన్నై సర్వీసులు ప్రతిపాదనలకే పరిమితం ● 87 సర్వీసులలో 73 ఆర్డినరీ బస్సులే

పీలేరు రూరల్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): పీలేరు ఆర్టీసీ డిపో రూ.11 కోట్ల నష్టాల్లో కూరుకుపోయింది. ఎంతోకాలంగా ఇక్కడి నుంచి హైదరాబాద్, చెన్నై, విజయవాడ, తిరుమల తదితర ప్రాంతాలకు వెళ్లే సర్వీసులను నష్టాల సాకుతో రద్దు చేయడమే ఇందుకు ప్రధాన కారణమని పలువురు అభిప్రాయపడుతున్నారు. మరోవైపు డిపోలో ఉన్న ఎక్స్‌ప్రెస్ సర్వీసులను క్రమంగా రద్దు చేయడం, అదనంగా కొత్త సర్వీసులు రాకపోవడం, మెజార్టీ సర్వీసులు ఆర్డినరీ కావడమే ఇందుకు ప్రధాన కారణమని పలువురు కార్మికులు వాపోతున్నారు. 118 సర్వీసులతో ప్రయాణీకుల సేవలో తరించిన పీలేరు డిపోలో ప్రస్తుతం 87 సర్వీసులకే పరిమితమైంది. నష్టాల సాకుతో 31 సర్వీసులను రద్దు చేయడం గమనార్హం. రద్దయిన సర్వీసులలో హైదరాబాద్, తిరుమల, చెన్నై, విజయవాడ తదితర సర్వీసులున్నాయి. పీలేరు ఆర్టీసీ డిపో నుంచి రోజుకు 35,735 కిలోమీటర్ల మేరకు బస్సులను నడుపుతూ సుమారు 30 వేల మంది ప్రయాణీకులను వారి గమ్యస్థానాలకు చేరవేస్తున్నారు. డీఎంతో పాటు డ్రైవర్లు, కండక్టర్లు, కార్యాలయ సిబ్బంది, గ్యారేజ్‌లో 431 మంది కార్మికులు పనిచేస్తున్నారు. రోజుకు రూ.15 లక్షలు కలెక్షన్ రావాల్సి ఉండగా 11 నుంచి 12 లక్షల రూపాయలు మాత్రమే వస్తోంది. ప్రధానంగా డిపో పరిధిలోని గ్రామీణ ప్రాంతాలకు నడుపుతున్న సర్వీసుల వల్లే భారీ నష్టాలను చవి చూడాల్సి వస్తోంది. ప్రతి మార్గంలో అనధికారికంగా ఆటోలు, జీపులు, ఇతర వాహనాలలో ప్రయాణీకులను తరలిస్తుండడంతో నష్టాలు తప్పడం లేదు.



పీలేరు ఆర్టీసీ బస్‌స్టేషన్

సమష్టి కృషితో నష్టాలు అధిగమిస్తాం



సమష్టి కృషితో నష్టాలు అధిగమిస్తాము. ప్రధాన కూడళ్లలో డ్రైవర్, కండక్టర్లు రెండు నిమిషాలు బస్సులను ఆపి ప్రయాణీకులను ఎక్కించుకునేలా చర్యలు చేపట్టాము. ప్రయాణీకులే సంస్థకు ప్రధాన ఆర్థిక వనరు కావడంతో డ్రైవర్, కండక్టర్లు వారి పట్ల గౌరవంగా వ్యవహరించాలి. ప్రయాణీకుల అవసరం మేరకు ప్రత్యేక సర్వీసులు నడుపుతాము.

- బి.నిర్మల, డిపో మేనేజర్, పీలేరు.

కొత్త సర్వీసులు నడపాలి



పీలేరు డిపో మనుగడను దృష్టిలో పెట్టుకుని కొత్త సర్వీసులను సుదూర ప్రాంతాలకు నడపాలి. పీలేరు నుంచి హైదరాబాద్, చెన్నై, తిరుమల, విజయవాడ, కర్నూలు మార్గాలలో కొత్త సర్వీసులు నడపాల్సిన అవసరం ఉంది. ఇదే విషయాన్ని ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లాము.

పీఎల్ఎం రాజు, ఎన్ఎంయూ ప్రధాన కార్యదర్శి

విశ్వం వేసవి శిక్షణ సమాచార పత్రిక ఆవిష్కరణ



సమాచార పత్రికను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డి, విశ్వనాథరెడ్డి

తిరుపతి(విద్య), ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): విశ్వం వేసవి శిక్షణ శిబిర సమాచార పత్రికను ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పి.చంద్రశేఖరరెడ్డి గురువారం ఆవిష్కరించారు. వరదరాజనగర్‌లోని విశ్వం విద్యాలయంలో చేపట్టిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ మాట్లాడుతూ జాతీయ స్థాయిలో నిర్వహించే సైనిక్, మిలటరీ, నవోదయ, పాలిటెక్నిక్ పోటీ పరీక్షలకు విశ్వం విద్యాసంస్థలు 35 సంవత్సరాలుగా అత్యుత్తమ శిక్షణనిస్తూ మంచి ర్యాంకులు సాధిస్తోందన్నారు. విద్యాసంస్థల అధినేత విశ్వనాథరెడ్డి మాట్లాడుతూ వేసవి సెలవులు వృథా కాకుండా పిల్లల భవిష్యత్తు దృష్ట్యా శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. మరింత సమాచారానికి 9399976999, 8688888880లను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో అపుస్మా నాయకులు భాస్కర్‌రాజు, రామకృష్ణారెడ్డి, ఎస్.ఎం.బాషా, రఘునారాయణరావు, జనార్దన్‌రెడ్డి, వెంకటేశ్ బాబు పాల్గొన్నారు.

పోక్సో కేసులో ఇద్దరు అరెస్టు

వేంపల్లె, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): వేంపల్లె పట్టణంలో ఓ బాలికను కిడ్నాప్ చేసి అత్యాచారం చేసిన కేసులో నిందితులుగా ఉన్న ఫాజిల్, ఆనంద్‌లను అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చినట్లు ఎస్ఐ రంగారావు తెలిపారు. వారం రోజుల క్రితం బాలికను ఫాజిల్ అనే యువకుడు కిడ్నాప్ చేసి అత్యాచారం చేశాడు. ఇందుకు ఆనంద్ సహకరించాడని ఆరోపిస్తూ బాలిక తండ్రి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు వీరిద్దరిపై పోక్సో కేసు నమోదైంది. గురువారం నిందితులను అరెస్టు చేసి పులివెందుల కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించడంతో కడప సబ్‌జైలుకు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

వివాహిత అదృశ్యం

కొండాపురం, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన కొండాపురం గ్రామానికి చెందిన ఓ వివాహిత అదృశ్యమైంది. పోలీసుల వివరాల మేరకు... పట్టణానికి చెందిన మంజల లక్ష్మీదేవి (43) అనే వివాహిత బుధవారం హాస్పిటల్‌కు వెళుతున్నానని భర్తకు చెప్పి ఇంట్లో నుంచి వెళ్లిపోయింది. అయితే ఆమె ఎంతకూ తిరిగి రాకపోవడంతో భర్త గురప్ప పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కాగా ఈమెకు ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నాడు. భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు కొండాపురం ఎస్సై ప్రతాప్‌రెడ్డి తెలిపారు.

రేషన్ కార్డు ఈకేవైసీ...



- చూసుకోండిలా.... చేసుకోండిలా
- ఈనెల 30 వరకు గడువు


ప్రొద్దుటూరు రూరల్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): ఈకేవైసీ చేయించుకోవాలి... లేకుంటే రేషన్ పంపిణీ నిలుపుదల చేస్తారు... ఇది రెండు నెలలుగా ఎక్కడ విన్నా వినపడుతున్న మాటలు. అయితే అసలు తాము ఈకేవైసీ చేయించుకోవాలో లేదో.. లేకపోతే ఎక్కడ చేయించుకోవాలో తెలియక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుకు రేషన్‌కార్డే కొలమానం. ప్రతి అయిదు సంవత్సరాలకు ఒకసారి కేంద్ర ప్రభుత్వ సూచనల మేరకు అందులో వివరాలు నవీకరించాల్సి ఉంది. చిన్నపిల్లలను చేర్చడం, చనిపోయిన వారి పేర్లను తొలగించాలి. అప్పుడే పథకాలకు ఎంత మంది అర్హులు వంటి విషయాలు తెలుస్తాయి. ఈకేసీవైసీ పెండింగ్ ఉన్న వారి జాబితా ఇప్పటికే ఆయా సచివాలయాలు, రేషన్ డీలర్ల వద్ద ఉంది. వారి వాద్దకు వెళితే వివరాలు నమోదు చేస్తారు. ఇలాంటివారు ఆన్‌లైన్‌లో ఈకేవైసీ స్టేటస్‌ను సొంతంగా చూసుకోవచ్చని అధికారులు చెబుతున్నారు. గత నెల 30 వరకు ఉన్న ఈ గడువును ఈనెల చివరి వరకు పెంచారు. ఆన్‌లైన్ ఈకేవైసీ స్టేటస్ సొంతంగా ఇలా తెలుసుకోవచ్చు.



ఈ-పాస్ యంత్రంలో..

రేషన్ డీలర్/ఎండీయూ వాహనంలో ఈ-పాస్ యంత్రం ఉంటుంది. దానిలో మీ రేషన్‌కార్డు వివరాలు నమోదు చేస్తే సభ్యుల వివరాలు వస్తాయి. ఎరుపు రంగు గడియలో పేర్లు ఉంటే ఈకేవైసీ పెండింగ్ ఉన్నట్లు. ఆకుపచ్చ రంగులో ఉంటే వారిది ఈకేసీవైసీ పూర్తయినట్లు. ఎరుపు రంగు గడియలో పేరు ఉన్న వారు ఆధార్ సంఖ్యను నమోదు చేసి వేలిముద్ర వేస్తే ఈకేవైసీ పూర్తవుతుంది.



ఆన్‌లైన్‌లోనూ ఇలా...

గూగుల్ వెబ్‌బ్రౌజ్‌లో ఈపీడీఎస్1 అని నమోదు చేసి ఎంటర్ నొక్కండి. డిపార్టుమెంట్ ఆఫ్ కన్జూమర్ ఎఫైర్స్, ఫుడ్ అండ్ సివిల్‌సప్లై ఏపీ అనే వెబ్‌సైట్ తెరచుకుంటుంది. దానిలో రేషన్‌కార్డు విభాగంలో ఆరు రకాల ఆప్షన్లు 'న్యూ' అనే పేరుతో కనిపిస్తాయి. ఈపీడీఎస్ అప్లికేషన్ సెర్చ్, రైస్‌కార్డు సెర్చ్ రెండు ఆప్షన్లలో ఒకదానిని క్లిక్ చేసి రేషన్‌కార్డు నంబరు నమోదు చేస్తే అందులో ఉన్నవారి పేర్లు వస్తాయి. ఆయా పేర్లు ఎదురుగా ఎస్ అని ఉంటే ఈకేవైసీ అయినట్లు, అలా కాకుండా నో కానీ, ఇంకేమైనా ఉంటే మాత్రం ఈకేవైసీ చేయించుకోవాల్సిందే. డీలర్ లేదా రేషన్ బండి వద్ద ఈ-పాస్ యంత్రంలో వేలిముద్ర వేసి ఈకేవైసీని పూర్తి చేసుకోండి. దీనికి ఏప్రిల్ 30 వరకు మాత్రమే గడువు ఉంది. అయిదు సంవత్సరాలలోపు, 80 సంవత్సరాలు పైబడిన వారికి ఈకేసీవైసీ అవసరం లేదు. మిగిలిన వారంతా విధిగా చేయించుకోవాల్సిందే.

పనితీరు మెరుగుపరుచుకోకపోతే చర్యలు తప్పవు

- ట్రాన్స్‌కో సిబ్బందికి ఎస్ఈ రమణ హెచ్చరిక


సబ్ స్టేషన్ వద్ద విద్యుత్ లైన్లను పరిశీలిస్తున్న ట్రాన్స్‌కో ఎస్ఈ రమణ

చెన్నూరు, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో పనితీరు బాగుండాలని.. ఇష్టానుసారంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని ట్రాన్స్‌కో ఎస్ఈ రమణ సిబ్బందిని హెచ్చరించారు. గురువారం చెన్నూరు విద్యుత్ కార్యాలయాన్ని ఆకస్మిక తనిఖీ చేసిన ఆయన మండలంలోని పలు ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ తీగలను పరిశీలించారు. పలుచోట్ల ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ లైన్లు తక్కువ ఎత్తులో ఉండటం గమనించి.. వెంటనే సరిచేయాలని ఆదేశించారు. వేసవికాలంలో విద్యుత్ సరఫరాలో అవాంతరాలు ఏర్పడితే ప్రజలు ఇబ్బందులు పడతారని.. సిబ్బంది లైన్ల వెంట తిరుగుతూ ఏవైనా లోపాలుంటే గుర్తించి ముందస్తు మరమ్మత్తులు చేపట్టాలని సూచించారు. డీఈ వెంకటేశ్వర్లు, ఏఈ రామలింగారెడ్డి, సబ్ ఇంజనీరు స్రవంతి పాల్గొన్నారు.

ప్రైవేటు పాఠశాలల్లో ఉచిత ప్రవేశాలకు దరఖాస్తులు

కడప ఎడ్యుకేషన్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): ప్రైవేటు పాఠశాలల్లో 2025-26 అకాడమిక్ సంవత్సరానికి సంబంధించి ఆర్టీఈ 2009 ప్రకారం ఉచిత ప్రవేశాలు పొందడానికి దరఖాస్తులు ఆన్‌లైన్‌లో ఆహ్వానిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి షంషుద్దీన్, సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్టు కో ఆర్డినేటర్ నిత్యానందరాజులు సంయుక్త ప్రకటనలో తెలిపారు. అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో రెండు ప్రవేశాలు ఉంటాయని తెలిపారు. ప్రతి ప్రైవేటు పాఠశాలలో కూడా ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొంటున్న, బలహీన వర్గాల విద్యార్థులకు 25శాతం సీట్లు కేటాయించాల్సి ఉంటుందన్నారు. ఐదేళ్లు వయసు నిండిన వారికే 1వ తరగతిలో మాత్రమే ప్రస్తుతం అడ్మిషన్లు ఇవ్వాల్సి ఉంటుందన్నారు. సీబీఎస్ఈ, ఐసీఎస్ఈ, ఐబీ సిలబస్ ఉన్న పాఠశాలల్లో ప్రవేశానికి 31.03.2025 నాటికి, స్టేట్ సిలబస్ పాఠశాలల్లో ప్రవేశానికి 01.06.2025 నాటికి ఐదేళ్లు నిండి ఉండాలన్నారు. ఆర్ఫాన్, హెచ్ఐవి, ప్రతికూల పరిస్థితులు ఎదుర్కొంటున్న వారికి ఐదు శాతం, ఎస్సీలకు పదిశాతం, ఎస్టీలకు నాలుగుశాతం, వీకర్ సెక్షన్స్, ఇతరులకు ఆరు శాతం సీట్లు లభిస్తాయన్నారు. ఎంపిక రాష్ట్రస్థాయిలో ఉంటుందన్నారు. ఈనెల 28 నుంచి వచ్చేనెల 15 వరకు విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందన్నారు. మే 16 నుంచి 20వ తేదీ వరకు గ్రామ సచివాలయం, వార్డు సచివాలయాల వద్ద ఉన్న డేటా తో పోల్చుకొని అడ్మిషన్లు ఇస్తారని తెలిపారు.

వైవీయూకు రూ.10కోట్లతో ఎన్‌ఆర్‌ఎఫ్‌పీఏఐఆర్ ప్రాజెక్టు

కడప ఎడ్యుకేషన్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): యోగివేమన విశ్వవిద్యాలయానికి మెగా రీసెర్చ్ ప్రాజెక్టు మంజూరైంది. అనుసంధాన్ నేషనల్ రీసెర్చ్ ఫౌండేషన్ పార్టనర్‌షిప్స్ ఫర్ యాక్సిలరేటెడ్ ఇన్నోవేషన్ అండ్ రీసెర్చ్ (ఏఎన్‌ఆర్ఎఫ్ పీఏఐఆర్) పథకం కింద యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్‌తో కలిసి రూ.10కోట్లు నిధులు మంజూరయ్యాయి. అత్యున్నత స్థాయి పరిశోధన సంస్థలతో జత చేయడం ద్వారా మెంటార్‌షిప్ మోడల్‌లో పరిశోధకులు బాగా పనిచేయగల సామర్థ్యాన్ని పెంచడానికి ఈ పథకం రూపొందించారు. ఈ ప్రాజెక్టు కోసం యోగివేమన విశ్వవిద్యాలయంలో రోగనిర్ధారణ, మెటబాలిక్, ఇన్ఫెక్షన్స్, అంటువ్యాధుల చికిత్సలు, వ్యాధి నిమా యంత్రాంగంపై దృష్టి సారించే మొత్తం 22 ప్రతిపాదనలను వివిధ విభాగాలలో కలిసి 27 మంది అధ్యాపకులు సమర్పించారు. ప్రాజెక్టు నిధులతో పరిశోధనలు ప్రారంభించనున్నారు. ఈ సందర్భంగా వైవీయూ వీసీ ప్రొఫెసర్ అల్లం శ్రీనివాసరావు మాట్లాడుతూ పరిశోధననిధులతో నాణ్యమైన పరిశోధనలు చేస్తామన్నారు. కార్యక్రమంలో వీసీతో పాటు మాజీ ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ కె.కృష్ణారెడ్డి, రిజిస్ట్రార్ పి.పద్మ, ప్రిన్సిపల్ ఎస్.రఘునాథరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

తెలుగుగంగ ఎస్ఈగా డి.వెంకట్రామయ్య



కడప, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): తెలుగుగంగ ప్రాజెక్టు సూపరింటెండెంట్ ఇంజనీరుగా డి.వెంకట్రామయ్యను మరోసారి ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు నీటిపారుదలశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. తెలుగుగంగ ఎస్ఈగా పనిచేసిన విజయగోపాల్ పదోన్నతిపై విజయవాడ వెళ్లారు. అప్పటి నుంచి ఇన్‌చార్జ్‌గా మునీర్‌బాషా పనిచేశారు. అయితే ప్రభుత్వం రెగ్యులర్ ఇరిగేషన్‌లో ఈఈగా పనిచేస్తున్న వెంకట్రామయ్యకు ఎస్ఈగా బాధ్యతలు అప్పజెప్పింది. గతంలో కూడా వెంకట్రామయ్య తెలుగుగంగ ఎస్ఈగా పనిచేసి ఉన్నారు.

స్వచ్ఛభారత్‌కు అందరూ సహకరించాలి


కొండపేటలో పర్యటిస్తున్న స్వచ్ఛభారత్ మిషన్ డైరెక్టరు స్వప్న

చెన్నూరు, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛభారత్‌కు ప్రజలు సహకరించాలని.. తద్వారా గ్రామీణ ప్రాంతాలు ఆరోగ్యంతో విలసిల్లి ఆదాయం దిశగా అడుగులు వేస్తాయని స్వచ్ఛభారత్ మిషన్ కేంద్ర పరిశీలన డైరక్టరు దేవిరెడ్డి స్వప్న అన్నారు. మండలంలోని కొండపేట, చెన్నూరులలో గురువారం స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టరు ఊర్మిలాదేవితో కలిసి పరిశీలించారు. ఈసందర్భంగా రెండు పంచాయతీల్లో ఎస్‌డబ్ల్యుపీసీలో ఉన్న వర్మీకంపోస్టును పరిశీలించి హరిత రాయబారులతో మాట్లాడారు. అనంతరం ప్రజలతో మాట్లాడుతూ స్వచ్ఛభారత్‌కు సహకరించి.. తడి పొడి చెత్తలను వేర్వేరుగా గ్రీన్‌అంబాసిడర్లకు అందించాలన్నారు. ఈ చెత్త ఎస్‌డబ్ల్యుపీసీకి చేరితే వర్మీకంపోస్టుగా మారి రైతులకు ఆదాయ వనరుగా మారుతుందన్నారు. అలాగే గ్రామాల్లో స్వచ్ఛమైన తాగునీరు, పరిశుభ్ర వాతావరణం, శుభ్రమైన వీధులు, మంచి లైటింగ్ వ్యవస్థ ఉండాలన్నా అది ప్రజలతో సాధ్యమన్నారు. స్వచ్ఛ సంకల్పానికి ప్రతిఒక్కరూ కంకణబద్ధులై ఉండాలని సూచించారు. డీపీఓ రాజ్యలక్ష్మి, జడ్పీ సీఈవో ఓబులమ్మ, సర్పంచ్‌లు తుంగ చంద్రయాదవ్, ఎంపీడీవో కిరణ్‌మోహన్‌రావు, ఎంపీపీ చీర్ల సురేశ్‌యాదవ్, ఎంపీటీసీ నాగిరెడ్డి, మాజీ సర్పంచ్ మోహన్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు, మండల అధికారులు, ఇంజనీర్లు పాల్గొన్నారు.

బీసీలను ఓటు బ్యాంకుగా చూసే పద్ధతికి స్వస్తి పలకండి

- బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు


మాట్లాడుతున్న కేశన శంకరరావు

కడప మారుతీనగర్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): బీసీలను ఓటు బ్యాంకుగా చూసే పద్ధతికి అన్ని రాజకీయ పార్టీలు స్వస్తి పలకాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేశన శంకరరావు పేర్కొన్నారు. గురువారం స్థానిక హరిత హోటల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 77 సంవత్సరాల స్వతంత్ర భారతంలో అణగారిన వర్గాలకు, ముఖ్యంగా వెనుకబడిన తరగతులైన ఓబీసీల జనగణన కులాల వారీగా వివరాలను శాస్త్రీయంగా సేకరించకపోవడం దురదృష్టకరమన్నారు. పలు రాజ్యాంగ సవరణల మేరకు ఎస్సీ, ఎస్టీలకు విద్య, విద్యా, ఉద్యోగ రంగాలతో పాటు చట్టసభలు, స్థానిక సంస్థలలో, ఇతర ఆర్థిక రంగాలలో జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్‌లు అమలవుతున్నాయన్నారు. జాతీయ స్థాయిలో కాకా కాలేక్కర్, బీపీ మండల్ కమిషన్లు, రాష్ట్ర స్థాయిలో మురళీధరరావు, జస్టిస్ రోహిణి కమిషన్‌లు దేశ, రాష్ట్ర జనాభాలో సుమారు 52 శాతానికి పైగా బీసీలున్నారని తెలియపరచిన సంగతి తెలిసిందే అన్నారు. భవిష్యత్తులో చట్ట సభలలో ఓబీసీలకు రిజర్వేషన్లు ఇవ్వాలన్నా, ఓబీసీ మహిళలకు సబ్ కోటానిస్తూ మహిళా రిజర్వేషన్ చట్టాన్ని సవరించాలన్నా, స్థానిక సంస్థలలో రిజర్వేషన్లు పెంచడంతో పాటు సంక్షేమ పథకాలు సక్రమంగా ఆయా అణగారిన కులాల దామాషా ప్రకారం అమలు చేయాలన్నా దేశ ప్రజలందరి జనగణనతో పాటు కుల గణన చేయాల్సి వుందన్నారు. బీసీ సంక్షేమ సంఘం యువజన విభాగం అధ్యక్షుడు క్రాంతికుమార్, జిల్లా అధ్యక్షుడు లింగమూర్తి, వర్కింగ్ ప్రెసిడెంట్ గోవిందు నాగరాజు, ప్రధాన కార్యదర్శి త్రివిక్రమ్, ఉపాధ్యక్షుడు కల్యాసుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

పశువైద్య కళాశాల ఏర్పాటు ఆత్మసంతృప్తినిచ్చింది : ఎమ్మెల్యే


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి

ప్రొద్దుటూరు టౌన్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): తన సుదీర్ఘ రాజకీయ జీవితంలో పశువైద్య కళాశాల ఏర్పాటు ఎంతో సంతృప్తినిచ్చిందని ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి పేర్కొన్నారు. గురువారం సాయంత్రం శ్రీ వెంకటేశ్వర పశువైద్య కళాశాల 12వ వార్షిక వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ మూగజీవాలకు సేవ చేయడం అదృష్టమని.. ఈ కోర్సు ఎంచుకున్న విద్యార్థులను అభినందించారు. ఈ కళాశాలలో చదివిన విద్యార్థులు కెనడ, ఆస్ట్రేలియాల్లో పనిచేస్తున్నారని, హైదరాబాదుకు వెళ్లినప్పుడు ఇక్కడ చదివిన విద్యార్థులు తనను గుర్తుపట్టి పలుకరించడం సంతోషంగా ఉందన్నారు. శ్రీ వెంకటేశ్వర వెటర్నరీ యూనివర్శిటీ వీసీ జేవీ రమణ మాట్లాడుతూ కళాశాలలో చదివిన విద్యార్థులు దేశ, విదేశాల్లో మంచి గుర్తింపు పొందారని, అలాగే ఇక్కడి విద్యార్థులు క్రీడలు, జాతీయస్థాయి సెమినార్లలో ఉత్తమ ప్రతిభ కనపరుస్తున్నారన్నారు.

కలెక్టరు చెరుకూరి శ్రీధర్ మాట్లాడుతూ భారతదేశ ఆర్థిక వ్యవస్థ శరవేగంగా అభివృద్ధి చెందుతోందన్నారు. దేశ ఆర్థిక వ్యవస్థలో 64 శాతం వ్యవసాయ రంగం నుంచి లభిస్తుండగా 20 శాతం పశు సంపదనుంచి లభిస్తోందన్నారు. పశువైద్యానికి ప్రపంచ వ్యాప్తంగా అధిక ప్రాధాన్యత ఉందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో శ్రీ వెంకటేశ్వర వెటర్నరీ యూనివర్శిటీ డీన్ డాక్టర్ వీరబ్రహ్మయ్య, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సీహెచ్ శ్రీనివాసప్రసాద్, డాక్టర్ కల్యాణి, పశువైద్య అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బైకును ఢీకొట్టిన కారు యువకుడు మృతి


శ్రీకాంత్‌రెడ్డి (ఫైల్)

చక్రాయపేట, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గండి దేవస్థానం సమీపంలో గురువారం సాయంత్రం బైకును కారు ఢీకొట్టడంతో సుబ్బిరెడ్డి గారి శ్రీకాంత్‌రెడ్డి (30) అనే యువకుడు మృతి చెందాడు. వివరాల్లోకెళితే... శ్రీకాంత్‌రెడ్డి గురువారం మధ్యాహ్నం బైకులో వేంపల్లెకు వెళ్లి మొబైల్ కొనుగోలు చేశాడు. అక్కడ నుంచి చక్రాయపేటకు తిరిగి వస్తుండగా రాయచోటి వైపు నుంచి స్పీడుగా వస్తున్న కారు ఢీకొట్టి వెళ్లిపోయింది. దీంతో శ్రీకాంత్‌రెడ్డికి తీవ్ర గాయాలు కావడంతో వేంపల్లె ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. శ్రీకాంత్‌రెడ్డికి వివాహమై ఒక కుమారుడు ఉన్నారు.

బైకు అదుపుతప్పి యువకుడు..

మైదుకూరు రూరల్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆదిరెడ్డిపల్లె వద్ద బుధవారం అర్ధరాత్రి మోటర్‌సైకిల్ అదుపుతప్పి కల్వర్టును ఢీకొనడంతో ఒకరు మృతి చెందగా, మరొకరు గాయపడినట్లు పోలీసులు తెలిపారు. గిద్దలూరుకు చెందిన సిద్దయ్య, ఆయన సోదరుడు జమ్మయ్య చిరు వ్యాపారాలు చేసుకుంటూ జీవనం సాగిస్తుండేవారు. ప్రొద్దుటూరులోని బంధువుల ఇంటికి వెళ్లి డబ్బులు తీసుకొని గిద్దలూరుకు వెళుతుండగా ఆదిరెడ్డిపల్లె వద్ద బైకు అదుపుతప్పి రోడ్డు మరమ్మత్తుల్లో ఉన్న కల్వర్ట్‌ను ఢీకొంది. దీంతో సిద్దయ్య(23) అక్కడికక్కడే మృతి చెందగా, జమ్మయ్య గాయపడ్డాడు. పోలీసులు కేసు నమోదు చేసి విచారిస్తున్నారు.

700 బస్తాల రేషన్ బియ్యం స్వాధీనం

ప్రొద్దుటూరు, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): రేషన్ బియ్యం అక్రమ రవాణా చేస్తున్న భారీ లారీని రూరల్ పోలీసులు పట్టుకున్నారు. గురువారం జమ్మలమడుగు బైపాస్ రోడ్డు నుంచి మైదుకూరు రోడ్డు వైపు వెళుతుండగా లోడుతో వున్న లారీని పోలీసులు తనిఖీ చేయగా.. అందులో రేషన్ బియ్యం వున్నట్లు నిర్ధారించుకున్నారు.

జమ్మలమడుగుకు చెందిన కామేశు అనే బియ్యం వ్యాపారి రేషన్ బియ్యాన్ని అక్రమంగా జమ్మలమడుగు నుంచి మైదుకూరు మీదుగా బయటి ప్రాంతాలకు తరలిస్తున్నట్లు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. అనంతరం స్టేషనుకు తరలించారు. ఈమేరకు సివిల్ సప్లయ్ డిప్యూటీ తహసీల్దారు మల్లికార్జునకు రూరల్ పోలీసులు సమాచారం ఇవ్వడంతో ఆయన వెళ్లి లారీలోని బియ్యంను పరిశీలించి ..రేషన్ బియ్యంగా ధ్రువీకరించారు. కేసు నమోదు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఎర్రచందనం దుంగల మాయంపై ఏసీబీ కేసు

- 15 మంది అటవీ శాఖ అధికారులపై విచారణకు ఆదేశాలు

కలికిరి, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): కడప జిల్లా మైదుకూరు మండలం వనిపెంట అటవీ రేంజ్ పరిధిలోని గోడౌన్ నుంచి ఎర్రచందనం దుంగలు మాయమైన సంఘటనకు సంబంధించి నాలుగేళ్ల క్రితం ఏసీబీ నమోదు చేసిన కేసులో 15 మంది అటవీ శాఖ అధికారులపై విచారణకు గురువారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. 2021 జనవరి 29న వనిపెంట రేంజర్ కార్యాలయం, చెక్‌పోస్టు, గోడౌన్‌లపై ఏసీబీ అధికారులు ఆకస్మిక తనిఖీలు చేపట్టగా ఈ విషయం వెలుగులోకి వచ్చింది. మొత్తం 1037 కిలోల బరువున్న 37 ఎర్రచందనం దుంగలు మాయమైనట్లు ఏసీబీ గుర్తించింది. దీనిపై అప్పట్లోనే ఏసీబీ కేసు నమోదు చేసింది. వనిపెంట రేంజర్ సహా 15 మంది అటవీశాఖ అధికారులు, సిబ్బందిని బాధ్యులుగా నిర్ధారిస్తూ తదుపరి చర్యల కోసం ప్రభుత్వానికి నివేదించింది. ఈ నివేదికను పరిశీలించిన ప్రభుత్వం విచారణకు ఆదేశిస్తూ గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. విచారణ ప్రారంభమయ్యేలోగా సంజాయిషీలు చెప్పుకునే అవకాశం కల్పిస్తూ విడివిడిగా నోటీసులు జారీ చేసింది. ఉమ్మడి బాధ్యులుగా గుర్తించిన వారిలో వనిపెంట అటవీ రేంజరు సీహెచ్ దినేష్‌కుమార్‌రెడ్డి, ప్రొద్దుటూరు వైల్డ్‌లైఫ్ డివిజనల్ ఫారెస్ట్ ఆఫీసర్ ఎం.నాగార్జునరెడ్డి, జూనియర్ అసిస్టెంటు జి.విజ్ఞాథ, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్లు జి.హరినాథ రాజు, సీహెచ్ బాలలింగారెడ్డి, జి.ఆనందం (రిటైర్డు), ఎస్.సుధాకర్ (రిటైర్డు), వై.రజనీకుమార్, పి.కృష్ణ, పి.రమణయ్య, జివి రమణ, సి.ప్రసాదరావు (రిటైర్డు), ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్లు ఎస్.బాబు (రిటైర్డు), పి.ఓబులసుబ్బన్న (రిటైర్డు), పి.ఎస్.ఎన్.రాజు (రిటైర్డు) ఉమ్మడిగా విచారణను ఎదుర్కోవాల్సి వుంది. ఇందులో రిటైర్డు ఉద్యోగులపై పెన్షన్ రూల్స్ మేరకు విచారణ జరుగనుంది. రాష్ట్ర పర్యావరణ, అటవీ, సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి జి.అనంతరాము ఈ మేరకు మొత్తం 22 జీవోలను గురువారం విడివిడిగా జారీ చేశారు.

దొంగల కోసం పోలీసుల వేట

- పోలీసుల అదుపులో ఒకరు.. ఇద్దరు పరార్


దెబ్బతిన్న దొంగల కారు, పరిశీలిస్తున్న పోలీసులు

చాపాడు, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): సినీ ఫక్కీలో దొంగల కోసం పోలీసులు వేటాడారు. ఒక దొంగ పట్టుబడగా.. మరో ఇద్దరు చాకచక్యంగా తప్పించుకొని పారిపోయారు. వివరాలిలా... ప్రొద్దుటూరు నుంచి ముగ్గురు దొంగలు కారులో వెళుతున్నట్లు సమాచారం రావడంతో రూరల్ పోలీసు స్టేషన్‌కు చెందిన ఎస్ఐలు అరుణ్‌రెడ్డి, వెంకటసురేష్ సిబ్బందితో కలసి గురువారం మధ్యాహ్నం వారిని వెంబడించారు. చాపాడు మండలంలోని తిప్పిరెడ్డిపల్లె గ్రామం నుంచి రాజుపాళెం వైపు వెళుతుండగా ముందుగానే ఎస్ఐ అరుణ్‌రెడ్డి వారి రాకను తెలుసుకుని కారుకు ఎదురుగా రోడ్డుకు అడ్డంగా తన కారును నిలిపారు. అయితే దొంగలు తప్పించుకునేందుకు ఆ కారును ఢీకొట్టడంతో దొంగల కారుముందు భాగం దెబ్బతింది. పోలీసులు అడ్డుకోవడంతో కారులో ఉన్న ముగ్గురు దొంగలలో ఒక మహిళా దొంగ, మరొకరు పక్కనే ఉన్న పొలాల్లోకి వెళ్లి తప్పించుకుని పారిపోయారు. ఒకరిని అదుపులోకి తీసుకుని, కారును స్వాధీనం చేసుకున్నారు. ఆ సమయంలో దొంగలు వారి కారులోని ఒక బ్యాగును పక్కనే ఉన్న కాలువలో పడవేయగా స్వాధీనం చేసుకున్నారు. కాగా, దొంగల కారులో నకిలీ కారు నెంబర్ల ప్లేట్లు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు.

'హైకోర్టు ఉత్తర్వుల మేరకు భూవివాదం పరిష్కరించాలి'

ప్రొద్దుటూరు, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వుల మేరకు భూ వివాదం పరిష్కరించాలని ఓ మాజీ సైనిక ఉద్యోగి కుటుంబ సభ్యులు డిమాండ్ చేశారు. మాజీ సైనికుడైన జింకా చెంద్రాయుడుకు ప్రభుత్వం కేటాయించిన రామేశ్వరం పొలంలోని 5.02 ఎకరాల భూమిని తమ కుమార్తెల పేరుతో మ్యూటేషన్ చేయాలని కోరుతూ జింకా విజయలక్ష్మి తన కుమార్తెలతో కలిసి గురువారం స్థానిక తహసీల్దారు కార్యాలయం వద్ద బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా దివంగత మాజీ సైనికుని కుమార్తెలు చంద్రావతి, భవానిలు మాట్లాడుతూ మా భూమి మా పెద్దనాన్న కుమారుడు జింకా బ్రహ్మయ్య ఆధీనంలో ఉందన్నారు. ఆ భూమిలోకి ఇరువురిని దిగవద్దని 164 సెక్షన్ పెట్టారన్నారు. కానీ ఆ భూమిలో పంటను దొంగలు ఎవరో కోసుకుపోయారని వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తమకు న్యాయం జరిగే వరకు ఇక్కడి నుంచి కదిలేది లేదన్నారు. తహసీల్దారు గంగయ్య, డిప్యూటీ తహసీల్దారు సాయినాథ్‌రెడ్డిలు వారితో మాట్లాడారు. 164 సెక్షన్ ఉల్లంఘించి ఎవరు పంట కోసుకుపోయారో చర్యలు తీసుకోమని రూరల్ పోలీసులకు ఉత్తర్వులు ఇచ్చామన్నారు. విచారించి చర్యలు తీసుకుంటామన్నారు. హైకోర్టు జడ్జిమెంట్‌లో కూడా ఈ భూవివాదంపై విచారించి మాజీ సైనికునికి ఒక అవకావశం ఇవ్వమని చెప్పిందన్నారు. కావున మీకు భూమి ఆన్‌లైన్ చేసే విషయం మా చేతిలో లేదన్నారు. మేము ఇరుపార్టీలకు నోటీసులు ఇచ్చి వారి దగ్గర వున్న ఆధారాలు పరిశీలించి కలెక్టర్‌కు నివేదికను పంపామన్నారు. జేసీ, కలెక్టర్లు నిర్ణయం తీసుకుంటారని.. వారి ఆదేశాలనుసారం న్యాయం చేస్తామన్నారు. సాయంత్రం వరకు బైఠాయించిన వారు తహసీల్దారు గంగయ్య ఇచ్చిన హామీతో నిరసన విరమించారు.

ఎస్సీ వర్గీకరణ పూర్తయినా అన్నదమ్ముల్లా కలిసి ఉంటాం

● టీడీపీ రాష్ట్ర సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు పంతగాని నరసింహప్రసాద్


మాట్లాడుతున్న పంతగాని

రైల్వేకోడూరు, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ పూర్తయినా మాల, మాదిగలు అన్నదమ్ముల్లా కలిసిమెలిసి ఉంటామని టీడీపీ రాష్ట్ర సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు పంతగాని నరసింహప్రసాద్ తెలిపారు. గురువారం రైల్వేకోడూరులోని ఆయన స్వగృహంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు రాష్ట్రంలోని దళితులందరూ ఐక్యంగా ఉండాలని కోరుకునే వ్యక్తి అన్నారు. ఎస్సీ వర్గీకరణ ఒక రాష్ట్రం పరిధిలో లేదన్నారు. గతంలో చంద్రబాబునాయుడు ఏ, బీ, సీ, డీ గా విభజించారన్నారు. మాదిగ కులాలు అభివృద్ధికి నోచుకోలేదని, ఎస్సీ వర్గీకరణ చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ఎస్సీ వర్గీకరణ జరిగితేనే మాదిగలు, మాలల్లో తారతమ్యాలు పోతాయని, సుప్రీం కోర్టు ఎస్సీ వర్గకరణ జరగాలని తెలిపిందని గుర్తు చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎస్సీ వర్గీకరణ కోసం రాజీవ్‌మిశ్రా కమిషన్ వేశారన్నారు. ఎస్సీలను మూడు భాగాలుగా విభజించారన్నారు. 2011లో నిర్వహించిన జనాభా లెక్కలు, 2026లో నిర్వహించనున్న జనాభా లెక్కల ప్రకారంగా రోస్టర్ విధానం ద్వారా ఎలాంటి సమస్యలు లేకుండా వర్గీకరణ జరుగుతుందన్నారు. తద్వారా మంచి ఫలితాలు వస్తాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ కార్పొరేషన్ ద్వారా రుణాలకు సంబంధించి దళితులందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. టీడీపీ యువ నాయకుడు మల్లెం హేమంత్, కస్తూరి దినేష్ పాల్గొన్నారు.

రైల్వే సహాయ మంత్రిని కలిసిన నాగోతు రమేశ్‌నాయుడు


మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న నాగోతు రమేశ్‌నాయుడు

రాజంపేట, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : రైల్వే సహాయ మంత్రి సోమన్నను రాష్ట్ర బీజేపీ కార్యవర్గ సభ్యుడు నాగోతు రమేశ్‌నాయుడు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజంపేటలో మధ్యలో ఆగిపోయిన ఆర్‌యూబీ పనులను గతి శక్తి పథకం కింద నూరు శాతం కేంద్ర నిధులను ఖర్చు పెట్టి పూర్తిచేయాలని కోరారు. ఓబులవారిపల్లె-కృష్ణపట్నం మార్గంలో ప్యాసింజర్ రైళ్లు నడిపితే నెల్లూరు, అమరావతి వెళ్లే ప్రయాణికులకు 100 కిలోమీటర్లు దూరం తగ్గి సమయం, డబ్బు ఆదా అవుతాయని మంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. రాజంపేటలో సంపర్క్ క్రాంతి అనుమతి ఉన్నా నిలపడం లేదని, కోవిడ్ సమయంలో ఆగిపోయిన చెన్నై ఎక్స్‌ప్రెస్ తదితర వాటిని వెంటనే ఆపాలని కోరారు. వెంటనే మంత్రి సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారన్నారు.

విధి నిర్వహణలో అంకితభావం అభినందనీయం: ఎస్పీ


బదిలీపై వెళుతున్న ఏఏవో కృష్ణుడిని సన్మానిస్తున్న ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు

రాయచోటిటౌన్, ఏప్రిల్17(ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో అంకితభావం అభినందనీయమని ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు అన్నారు. జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయం సమావేశ మందిరంలో పదోన్నతి పొంది బదిలీపై వెళుతున్న ఏవో బీ. కృష్ణుడుకి గురువారం సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎస్పీ మాట్లాడుతూనూ తన జిల్లా ఏర్పడినప్పటి నుంచి ఏఏవోగా విధులు నిర్వహిస్తున్న కృష్ణుడు గుంతకల్లు రైల్వే ఏవోగా బదిలీపై వెళుతుండటం సంతోషకరమన్నారు. శాలువా, పూలమాలతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు. జిల్లా అదనపు ఎస్పీ ఎం.వెంకటాద్రి, ఏవో బీ.కృష్ణుడు, ఏఏవో జే. త్రినాథ సత్యం, డీసీఆర్బీ సీఐ తులసిరాం, ఆర్‌ఐలు, వీజే రామకృష్ణ, ఎం.పెద్దయ్య, ఎస్పీసీసీ జీ. ఉదయ్‌కుమార్, జిల్లా పోలీసు కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నూతన ఏఏవోగా త్రినాథ సత్యం

రాయచోటిటౌన్, ఏప్రిల్17(ఆంధ్రజ్యోతి): పార్వతీపురం- మన్యం జిల్లా నుంచి బదిలీపై వచ్చిన జే.త్రినాథ సత్యం గురువారం అన్నమయ్య జిల్లా పోలీసు కార్యాలయ నూతన ఏఏవోగా ఆధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా నూతన ఏఏవో త్రినాథసత్యంకు జిల్లా ఎస్పీ పలు సూచనలు చేశారు. సహోద్యోగులతో స్నేహపూర్వకమైన, సహకారపూరితమైన సంబంధాలను కొనసాగించాలన్నారు. జట్టుగా పనిచేయడం ద్వారా మనం గొప్ప ఫలితాలను సాధించగలమన్నారు. విధులను సమర్థవంతంగా నిర్వర్తించి పోలీసుశాఖకు మంచిపేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

మహర్షి వాల్మీకి బోయ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శిగా బాలిరెడ్డి దిలీప్‌జోషి



రాయచోటిటౌన్, ఏప్రిల్17(ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా మహర్షి వాల్మీకి బోయ సంఘం ప్రధాన కార్యదర్శిగా బాలిరెడ్డి దిలీప్‌జోషిని ఎన్నుకొన్నట్లు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఏ. ప్రభాకర్, ఉపాధ్యక్షుడు ఎన్. మహేశ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జే. శ్రీనివాసరావులు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా దిలీప్‌జోషి మాట్లాడుతూ తనపై నమ్మకంతో తనను ఎన్నుకున్నందుకు ధన్యవాదాలు తెలిపారు. వాల్మీకి, బోయ జాతి హక్కుల కోసం పోరాడతానన్నారు. చిరకాల వాంఛ అయిన ఎస్టీ హోదా కల్పించడంలో రాజకీయ పార్టీలు విఫలమయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్టీ హోదా సాధనే ధ్యేయంగా భవిష్యత్తులో కార్యాచరణను కొనసాగిస్తామన్నారు.

గంగమ్మకు ప్రత్యేక పూజలు

సిద్దవటం, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మాధవరం-1 పార్వతీపురం గ్రామంలో వెలసిన శీతల గంగమ్మ అమ్మవారికి గురువారం ఆ ప్రాంత మహిళలు బోనాలు సమర్పించి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ పూజారి రంగమ్మ మాట్లాడుతూ ప్రతియేటా ఏప్రిల్‌లో మహిళలు అమ్మవారికి నాలుగు వారాలు బోనాలు సమర్పిస్తారని, వర్షాలు పడి రైతుల సిరిసంపదలతో వర్ధిల్లాలని అమ్మవారి అనుగ్రహం ఉండాలని అన్నారు.

గంగమ్మతల్లి జాతరకు చాటింపు

రైల్వేకోడూరు, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): గంగమ్మతల్లి జాతర కోసం బుధవారం రాత్రి నిర్వాహకులు చాటింపు వేశారు. గురువారం ఉదయం దున్నపోతును పట్టుకుని పూజలు చేశారు. ప్రతి ఇంటికి దున్నపోతు వస్తుంది. దాంతో పాటు గంగమ్మతల్లి ప్రతిమను పెట్టుకుని ఇళ్లలో పెట్టి పూజలు చేస్తారు. ఇలా మే 1వ తేదీ వరకు ప్రతి ఇంటికి ఘటంకుండ వెళుతుంది. ఈ నెల 30న జాతర ఉత్సవాలు నిర్వహిస్తారు. 1న జాతర జరుగుతుంది. 2వ తేదీ తెల్లవారుజామున దున్నపోతును బలి ఇస్తారు. జాతరకు ఇతర ప్రాంతాల నుంచి వివిధ రకాల వేషాలు, డ్రమ్స్, విజయవాడ తప్పెట్లు తెప్పిస్తారు. కోడూరులో మూడు రోజుల పాటు సందడి వాతావరణం నెలకొంటుంది.

కోడూరులో జోరుగా ఇసుక దందా

● రాత్రికి రాత్రే డంపులు దింపుతున్న వైనం ● ఉదయానికి అమ్మకాలు ● ఒక ట్రాక్టర్ రూ. 4000కు విక్రయాలు


రైల్వేకోడూరు బైపాస్ రోడ్డు వద్ద ఇసుక డంప్


అమ్మకానికి సిద్ధంగా ఇసుక ట్రాక్టర్లు

రైల్వేకోడూరు, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): రైల్వేకోడూరులో ఇసుక దందా నడుస్తోంది. రాత్రికి రాత్రే ఇసుకను తరలించి డంప్ చేస్తున్నారు. ఉదయానికి విక్రయాలు చేస్తున్నారు. ఒక్క ట్రాక్టర్ రూ.4000కు విక్రయిస్తున్నారు. ఇది అంతా ఖద్దరు బాబుల కనుసన్నల్లో సాగుతోంది. వివరాల్లోకి వెళితే.... రాజంపేట నియోజకవర్గంలోని పలు రీచ్‌ల్లో ఇసుక నిల్వ ఉంది. అక్కడి నుంచి అన్ని ప్రాంతాలకు ఇసుకను సరఫరా చేస్తుంటారు. రోజు 5 నుంచి 6 మంది పేర్లతో ఇసుకను రైల్వేకోడూరుకు రాత్రి వేళల్లోనే తరలిస్తుంటారు. ఉదయానికి కల్లా ఇసుక విక్రయాలు జరిగిపోతాయి. రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా ఇస్తున్నప్పటికి 20 టన్నుల ఇసుకను రూ. 12,000కు దింపుతున్నారు. వైసీపీ ప్రభుత్వంలో 20 టన్నుల ఇసుకను రూ.14,000కు విక్రయాలు చేసేవారు. దానికి, దీనికి వ్యత్యాసం రెండు వేలే. బాలరాజుపల్లె ఇసుక రీచ్‌లోనే ఇసుకను తోడుతున్నారు. అక్కడ కాంట్రాక్టర్‌కు 20 టన్నుల ఇసుకు రూ.1730 చెల్లిస్తున్నారు. అయితే ఇసుకను లారీకి పోసేందుకు రూ.5000 ఇస్తున్నారు. మొత్తం 20 టన్నుల ఇసుకను రైల్వే కోడూరులోని బైపాస్‌లో అన్‌లోడింగ్ చేస్తారు. ఇక్కడ డంప్ చేసి ఉదయానికల్లా విక్రయాలు జరిగిపోతాయి. ఒక్క ట్రాక్టర్ లోడింగ్ చేసుకుని రూ.4000కు విక్రయాలు చేసుకుంటున్నారు. ఈ దందా చాలా కాలంగా సాగుతోంది. భవన నిర్మాణాలు రైల్వేకోడూరులో జోరుగా సాగుతున్నాయి. దీంతో ఇసుకకు డిమాండ్ ఎక్కువగా ఉంటుంది. బైపాస్ రోడ్డులో దర్జాగా ఇసుకను డంప్ చేసి అమ్మకాలు సాగిస్తున్నారు. దీనిపై ఎవరైనా ప్రశ్నిస్తే దిక్కున్న చోట చెప్పుకోపో అన్న విధంగా ఇసుకాసురులు బెదిరిస్తున్నారు. రైల్వేకోడూరులో సుమారు ఇసుక వ్యాపారులు 20 మందికి పైగా ఉన్నారు. అందరూ ఖద్దరు బాబుల అండదండలు ఉన్న వారే. అయితే వారు చెప్పిందే వేదంగా ఉంటుంది. వెంకయ్యస్వామి ఆలయం సమీపంలో కూడా ఇసుక డంప్ ఉంది. అక్కడ నుంచి విక్రయాలు నేరుగా భవన నిర్మాణ దారులకు పంపుతుంటారు. ఎక్కడపడితే అక్కడ విచ్చలవిడిగా ఇసుకను దింపి విక్రయాలు సాగిస్తున్నారు. ఇసుక సరఫరా కు అదుపు లేకుండా పోతోంది. ఇసుకాసురులు అమ్ముకుని సొమ్ము చేసుకుంటున్నారు. ఎక్కడా లేని విధంగా రైల్వేకోడూరులో ఇసుక అమ్మకాలు ముమ్మరంగా సాగుతున్నా పట్టించుకునే వారు లేరు.

ప్రైవేట్ ఏజెన్సీలు వద్దు: సీఐటీయూ


మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న కార్మికులు

రాయచోటిటౌన్, ఏప్రిల్17(ఆంధ్రజ్యోతి): పారిశుధ్యం, ఇంజనీరింగ్ విభాగాలకు చెందిన కార్మికులను ఆప్కాస్ నుంచి తొలగించి ప్రైవేట్ ఏజెన్సీలకు అప్పగించాలనే రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు బీవీ రమణ, నేతలు చెన్నయ్య, రాంబాబు, అక్బర్, శంకరయ్య, సీఐటీయూ జిల్లా కార్యదర్శి రామాంజు డిమాండ్ చేశారు. గురువారం సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులు రాయచోటి మున్సిపల్ కార్యాలయం వద్ద మహాధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేస్తామన్న మాటీని తుంగలో తొక్కి లక్షలాది మంది కార్మికులను దగా చేసిందన్నారు. కూటమి ప్రభుత్వం కూడా కార్మికుల ఆశలను నెరవేర్చకపోగా పొరుగు సేవల సిబ్బందికి గుడ్డిలో మెల్లగా ఉన్న ఆప్కాస్‌ను రద్దు చేసి లక్ష మంది కార్మికుల జీవితాలను ప్రైవేట్ ఏజెన్సీలకు కట్టబెట్టాలని నిర్ణయిస్తూ కార్మికులకు తీరని ద్రోహం చేస్తోందని ఆరోపించారు. ప్రైవేటు ఏజెన్సీలకు అప్పగిస్తే కార్మికులకు ఉద్యోగ భద్రత లేకుండా పోతుందన్నారు. జీత భత్యాలలో కోతలు, పీఎఫ్, ఈఎస్ఐ నిధులు స్వాహా జరిగే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. మున్సిపల్ కార్మికులు తిరుపాల్, సురేశ్, సిద్దిమల్లు, సీఎం లక్ష్మీదేవి, కేశమ్మ, వెంకటలక్ష్మి, సుభాషిణి, శ్రీనివాసులు, రెడ్డికుమార్, రమణ, వెంకటేశ్వర్లు, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల వినూత్న నిరసన


మోకాళ్లపై నిరసన తెలుపుతున్న మున్సిపల్ కార్మికులు

రాజంపేట టౌన్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు చిట్వేలి రవికుమార్ డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయ ఆవరణంలో మున్సిపల్ కార్మికులు నిర్వహిస్తున్న నిరసన మూడో రోజు వినూత్న రీతిలో మోకాళ్లపై భైఠాయించి తెలియజేశారు. ఆప్కాస్‌ను తొలగించి కార్మికులను పర్మినెంట్ చేయాలన్నారు. లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కార్మికుల యూనియన్ జిల్లా కార్యదర్శి పీవీ రమణ, నాయకులు ప్రసాద్, లక్ష్మీదేవి, ఎం.రమణ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో బోనాలు

నందలూరు, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నందలూరు గ్రామంలో వెలసిన నడివీధి గంగమ్మకు గురువారం మహిళలు భక్తిశ్రద్ధలతో బోనాలు సమర్పించారు. తెల్లవారుజాము నుంచే గంగమ్మకు ప్రత్యేక పూజలు జరిగాయి. భక్తులు అమ్మవారిని దర్శించుకుని తమ మొక్కులను తీర్చుకున్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు జరగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

ఘనంగా గ్రామోత్సవం

చిట్వేలి, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : చిట్వేలి గాజుల వీధిలోని నూతనంగా నిర్మించిన సీతా రామ లక్ష్మణ హనుమంతు సమేత నూతన విగ్రహాలకు గురువారం ఘనంగా గ్రామోత్సవం నిర్వహించారు. ఆలయానికి రిటైర్డ్ టీచర్ దోసెల రవీంద్ర, శ్రీమతి వెంకటకళ్యాణి కుటుంబ సభ్యులు 4 వెండి కిరీటాలు, శిఖర కలశం, ధ్వజస్తంభం వితరణగా అందించినట్లు నిర్వాహకులు తెలిపారు. అలాగే ఆకేపాటి వెంకటరెడ్డి శ్రీమతి ధనలక్ష్మి కుటుంబ సభ్యులు గంట, వెండి దీపాలను బహూకరించారు. భక్తులు గ్రామోత్సవంలో పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ ఉమామహేశ్వర్‌రెడ్డి, గ్రామ పెద్దలు, యువత పాల్గొన్నారు.

జాబ్ మేళాకు విశేష స్పందన

రైల్వేకోడూరు,ఏప్రిల్17(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో గురువారం ప్రిన్సిపాల్ భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన జాబ్ మేళాకు విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ ఏ విద్యావంతుడూ నిరుద్యోగిగా ఉండరాదని జాబ్ మేళా నిర్వహిస్తున్నామన్నారు. ఎంపీడీవో నాగార్జునరావు, స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ జిల్లా అధికారి వి. వెంకటేశ్వర్లు, కళాశాల స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ కో-ఆర్డినేటర్ రమేష్, స్కిల్ హబ్ కో-ఆర్డినేటర్ సునీల్‌కుమార్ మాట్లాడుతూ మేళాను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

వికలాంగురాలిపై లైంగిక దాడికి యత్నం

గాలివీడు, ఏప్రిల్17(ఆంధ్రజ్యోతి): అభం శుభం తెలియని ఓ వికలాంగురాలిపై రేపన వెంకట్రమణ అనే వ్యక్తి లైంగిక దాడికి పాల్పడ్డాడంటూ గురువారం కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు, కుటుంబ సభ్యులు, గ్రామస్థుల కథనం మేరకు... మండలంలో నివాసముంటున్న బాధితురాలిపై వెంకట్రమణ మద్యం సేవించి బుధవారం మధ్యాహ్నం వికలాంగురాలిని ఇంట్లోకి లాక్కెళ్లి లైంగిక దాడికి యత్నించాడు. గ్రామస్థులు బాధితురాలిని రక్షించారు. బాధితురాలి కుటుంబ సభ్యులు పోలీసులను ఆశ్రయించారు. కేసు నమోదు చేశారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన అవసరం

సుండుపల్లె, ఏప్రిల్17(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కలిగి ఉండాలని ఆర్‌హెచ్‌జీబీఎంఎస్ఎస్ సంస్థ ప్రతినిధి బీవీ రత్నం తెలిపారు. గురువారం మండల కేంద్రంలోని ప్రాథమిక వైద్య కేంద్రంలో ఆశావర్కర్లు, వైద్య సిబ్బందికి ఆర్థిక అక్షరాస్యతపైన ఆర్డీఐ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సమావేశంలో భాగంగా అవగాహన కల్పించారు. సంస్థ ప్రతినిధులు రాచరాయుడు, వెంకటయ్య, చంద్రనాయక్ పాల్గొన్నారు.

'ఎస్సీ వర్గీకరణను ఆమోదించడం హర్షణీయం'

రాజంపేట టౌన్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : ఎస్సీ వర్గీకరణ బిల్లులను రాష్ట్ర ముఖ్యమంత్రి మండలిలో ఆమోదించడం హర్షణీయమని ఎస్సీసెల్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మందా శ్రీనివాసులు కొనియాడారు. గురువారం టీడీపీ కార్యాలయంలో సీఎం చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. దళిత నేతలు సూరేపల్లె మురళీధర్, రామ్మోహన్, సునీల్, జడ మధు తదితరులు పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీ నిధులను స్వాహా చేసిన సర్పంచ్

● బినామీ సర్పంచ్‌లపై చర్యలు తీసుకోండి ● కాటిమాయకుంట గ్రామ సచివాలయం వద్ద గ్రామస్థులు నిరసన


నిధుల దుర్వినియోగంపై సచివాలయం వద్ద నిరసన తెలుపుతున్న గ్రామ ప్రజలు

రాయచోటిటౌన్, ఏప్రిల్17(ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ నిధులను దుర్వినియోగం చేయడంతో పాటు స్వాహా చేసిన గ్రామ సర్పంచ్ వెంకటేశ్, బినామీ సర్పంచ్, వైసీపీ నాయకుడు శంకర్‌రెడ్డిలపై చర్యలు తీసుకోవాలని గురువారం రాయచోటి మండల పరిధిలోని కాటిమాయకుంట గ్రామ సచివాలయం వద్ద గ్రామ ప్రజలు నిరసన తెలిపారు. మాజీ సర్పంచ్ కొండా భాస్కర్‌రెడ్డి, గ్రామ నాయకులు నాగార్జునరెడ్డి, పాపయ్య ఆధ్వర్యంలో ఈ నిరసన జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ పంచాయతీ అభివృద్ధి కోసం వచ్చిన నిధులను దుర్వినియోగం చేయడమే కాకుండా గ్రామ సర్పంచ్ వెంకటేశ్‌తో పాటు బినామీ సర్పంచ్ శంకర్‌రెడ్డిలు ఇద్దరు కలిసి గ్రామ పంచాయతీలో ఎటువంటి అభివృద్ధి పనులు చేయకుండానే నిధులను దుర్వినియోగం చేసి స్వాహా చేశారంటూ గ్రామస్థులు ఆరోపించారు. తానే గ్రామ సర్పంచ్‌ను అంటూ సర్పంచ్ వెంకటేశ్ సంతకాన్ని బినామీ సర్పంచ్, గ్రామ వైసీపీ నాయకుడు శంకర్‌రెడ్డి ఫోర్జరీ చేసి లక్షల్లో గ్రామ పంచాయతీ నిధులు స్వాహా చేశారంటూ వారు ఆరోపించారు. గ్రామంలో తాగునీటి సమస్య తీర్చకుండానే గ్రామ సర్పంచ్ వెంకటేశ్ సంతకాన్ని వైసీపీ నాయకుడు శంకర్‌రెడ్డి ఫోర్జరీ చేసి రూ.20 లక్షలు నీటి బిల్లులను డ్రా చేశారంటూ గ్రామస్థులు పేర్కొన్నారు. సర్పంచ్ వెంకటేశ్‌ను అడ్డం పెట్టుకొని వైసీపీ నాయకుడు శంకర్‌రెడ్డి అవినీతి, అక్రమాలకు పాల్పడ్డారంటూ గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామ పంచాయతీ నిధులను స్వాహా చేసిన సర్పంచ్ వెంకటేశ్, బినామీ సర్పంచ్, వైసీపీ నాయకుడు శంకర్‌రెడ్డిలపై జిల్లా పంచాయతీ అధికారులు విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

'ఉపాధి నిధులను ఇతర రంగాలకు మళ్లించరాదు'

రైల్వేకోడూరు, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): ఉపాధి నిధులను చట్టవిరుద్ధంగా ఇతర రంగాలకు మళ్లించరాదని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు పండుగోల మణి, కార్యదర్శి తోపు క్రిష్ణప్ప తెలిపారు. గురువారం రైల్వేకోడూరు సర్పంచ్ బుడిగి శివయ్య ఆధ్వర్యంలో కష్టజీవుల పాదయాత్రను జయప్రదం చేయాలని కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధిలో పని చేసే సిబ్బందికి అన్ని సౌకర్యాలూ కల్పించాలని, వారిపై రాజకీయ వేధింపులు ఆపాలని డిమాండ్ చేశారు. సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి జయరామయ్య, నాయకులు మల్లిక వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

'జనసేన పార్టీలో ఆ ముగ్గురిదే హవా?'

రైల్వేకోడూరు రూరల్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): జనసేన పార్టీలో ఆ ముగ్గురిదే హవా అని మాజీ ఎంపీటీసీ వరికూటి నాగ రాజు, ముద్దపోలు రామసుబ్బయ్య, వీరేంద్ర తెలిపారు. గురువారం మండలంలోని మైసూరివారిపల్లి పంచాయతీలో ఉన్న జనసేన కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల అనంతరం కోడూరులో ఆ ముగ్గురి హవా మాత్రమే నడుస్తుందని ఆరోపించారు. మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి విషయంలో ఎమ్మెల్యే నమ్మించి మోసం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయం రాష్ట్ర నాయకులు దృష్టికి తీసుకెళ్తామన్నారు.

తెలుగు యువత ఆధ్వర్యంలో రక్తదానం

లక్కిరెడ్డిపల్లె, ఏప్రిల్17(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రవాణా, యువజన, క్రీడశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి ఆదేశాల మేరకు లక్కిరెడ్డిపల్లె మండల తెలుగు యువత అధ్యక్షుడు పక్కీరయ్య ఆధ్వర్యంలో బాలింతకు లక్కిరెడ్డిపల్లెకు చెంది వేల్పుల సుధాకర్ రక్తదానం చేశారు. సుధాకర్ సకాలంలో రక్తదానం చేసి ప్రాణం పోశారని డాక్టర్లు తెలిపారు.

పారదర్శకంగా భూముల రీసర్వే

గాలివీడు, ఏప్రిల్17(ఆంధ్రజ్యోతి): భూముల రీసర్వేను పారదర్శకంగా నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ భాగ్యలత పేర్కొన్నారు. గురువారం మండలంలోని గోనపల్లె గ్రామంలో ఆమె మాట్లాడుతూ భూసర్వే చేసి హద్దులు నిర్ధారించనున్నట్లు తెలిపారు. గ్రామాల్లో భూవివాదాల పరిష్కారంతో పాటు రికార్డులను నవీకరించడమే ఈ కార్యక్రమం ఉద్దేశ్యమన్నారు.

చాకిబండ ఉరుసులో ప్రసాద్‌బాబు


దర్గా వద్ద ప్రార్థనలు చేస్తున్న సుగవాసి ప్రసాద్‌బాబు

చిన్నమండెం, ఏప్రిల్17(ఆంధ్రజ్యోతి): మండలంలోని చాకిబండ కస్పాలో వెలిసిన హజరత్ ఫకీర్‌షావలి బాబా దర్గా ఉరుసులో టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి, టీటీడీ పాలక మండలి మాజీ సభ్యుడు సుగవాసి ప్రసాద్ బాబు బుధవారం రాత్రి పాల్గొన్నారు. చాకిబండ పట్టణ టీడీపీ నాయకులు, మైనార్టీ నాయకులతో కలిసి ఉరుసుకు ప్రసాద్ బాబును ఆహ్వానించారు. ప్రసాద్‌బాబుకు ఊరేగింపుతో ఘనస్వాగతగం పలికారు.

హెపటైటిస్-బీపై అవగాహన

సంబేపల్లె, ఏప్రిల్17(ఆంధ్రజ్యోతి): సంబేపల్లె ఆదర్శ పాఠశాలలో విద్యార్థులకు హెపటైటీస్-బీపై సంబేపల్లె పీహెచ్‌సీ సిబ్బంది గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. హెపటైటీస్‌లోని రకాలు, నివారణోపాయాలు గురించి ప్రిన్సిపాల్ దిలీప్‌కుమార్ పీహెచ్‌సీ సిబ్బంది వివరించారు. హెపటైటీస్-బీలో ఏసీబీడీఈ అనే రకాలు ఉంటాయన్నారు. శరీరం త్వరగా అలిసిపోవడం, కడుపు నొప్పిగా ఉండటం, ఆకలిగా లేకపోవడం, వికారం, వాంతులు అవ్వడం, చర్మం రంగు మారడం, కళ్లు పసుపు రంగులోనికి మారడం, యూరిన్ రంగు మారడం హెపటైటీస్ లక్షణాలు అన్నారు.

ఆర్సీపీ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శిగా జయచంద్ర

రైల్వేకోడూరు రూరల్, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి):ఆర్సీపీ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి రంబాల సతీష్ అధ్యక్షతన పట్టణంలోని కార్యాలయంలో నూతన కమిటీని ఎంపిక చేశారు. జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శిగా జయచంద్ర ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా జయచంద్ర మాట్లాడుతూ ప్రజా సమస్యలపై పోరాటాలు చేస్తూ, వాటి పరిష్కారినికి కృషి చేస్తానన్నారు.

సబ్సిడీపై వ్యవసాయ పరికరాలు పంపిణీ

పెనగలూరు, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : 2024-25 ఆర్థిక సంవత్సరానికి గాను సబ్సిడీ పనిముట్లకు దరఖాస్తు చేసుకున్న రైతులకు ప్రభుత్వం ఇచ్చే సబ్సిడీపోను రైతు వాటా చెల్లించిన ముద్రపల్లె, పెనగలూరు రైతులకు గురువారం వ్యవసాయ పనిముట్లు పంపిణీ చేసిన ఏవో సుబ్రమణ్యం తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతుసేవా కేంద్రాల సిబ్బంది గంగా భవాని, హర్షవర్దన్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

రామాపురం, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి) : మండలంలోని నీలకంఠరావుపేట పంచాయతీ దర్గా సమీపంలో గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో రామాపురం పోస్టాఫీస్‌లో ప్యాకర్‌గా పనిచేసే సాయిసూర్య(20) దుర్మరణం చెందాడు. ఎస్ఐ వివరాల మేరకు.. వైఎస్సార్ జిల్లా చక్రాయపేట మండలం నక్కలదిన్నె గ్రామానికి చెందిన సాయిసూర్య ద్విచక్రవాహనంపై తన బంధువుల ఇంటికి వెళుతుండగా దర్గా సమీపంలో స్కూటర్ అదుపు తప్పి బోల్తాపడటంతో మృతిచెందాడు.

ఒకటిన్నర ఎకరం.. ఆరు పంటలు

● మిరప, కాలిఫ్లవర్, బొప్పాయి, చీనీ అంట్లు, టమోట, ఉల్లిపాయల సాగు చేసిన రైతు

రైల్వేకోడూరు, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): ఓ రైతు ఒకటిన్నర ఎకరం పొలంలో ఆరు పంటలు సాగు చేశాడు. దున్నకాలు తప్ప అన్ని యాజమాన్య పద్ధతులను తానే స్వయంగా చూసుకుంటూ సాగు చేస్తున్నాడు. మండలంలోని బయనపల్లె గ్రామానికి చెందిన కూకట్ల సుబ్బరాయుడు అనే రైతు తనకు ఉన్న ఒకటిన్నర ఎకరం పొలంలో మిరప, కాలిఫ్లవర్, బొప్పాయి, చీనీ అంట్లు, టమోట, ఉల్లిపాయలు సాగు చేస్తున్నాడు. ఒకే పొలంలో అన్ని రకాల పంటలను సాగు చేయడం లక్ష్యంగా పెట్టుకున్నాడు. ఆరు పంటలు వేసినందు వల్ల ఒక దాంట్లో కాకున్నా మరొక పంటలో ఆదాయం వస్తుందనే ఆలోచనతో ఆరు పంటలను వేశాడు. ఉల్లిపాయలు గట్టు మీద ఎనిమిది వరసలు వేశారు. 20 సెంట్లలో మిరప, 30 సెంట్లలో కాలిఫ్లవర్, 40 సెంట్లలో చీనీ నిమ్మ అంట్లు, 10 సెంట్లలో టమోట, మిగిలిన ఎకరా భూమిలో బొప్పాయి పంట సాగు చేస్తున్నాడు. 20 రోజుల్లో కాలిఫ్లవర్ కోతకు వస్తుంది. అదే విధంగా మిరప 15 రోజుల్లో కోతకు వస్తుంది. టమోటా ప్రస్తుతం కోత దశలో ఉంది. ఉల్లిపాయలు 20 రోజుల్లో కోత దశకు వస్తాయి. చీనీ నిమ్మ అంట్లు 50 రోజుల్లో ఇతర ప్రాంతాలకు ఎగుమతి చేసే విధంగా వస్తాయి.


టమోటా, ఉల్లి సాగు

ఒకే పంట వేస్తే ఆదాయం రాదని ...



ఒకే పంటను వేస్తే ఆదాయం రాదని తెలుసుకుని ఆరు పంటలు వేశాను. బొప్పాయి పంటను ఒకటిన్నర ఎకరంలో వేస్తే తెగుళ్లు రావచ్చు, దిగుబడి రాకుండా ఉండవచ్చు, ధరలు లేకుండా ఉండ వచ్చు ఇలా ఏదైనా జరగవచ్చునని ఆలోచించి ఆరు రకాల పంటలను వేశాను. ఒకటి కాకున్నా మరొకటి లాభాన్ని చేకూర్చుతుంది.

- కూకట్ల సుబ్బరాయుడు, ఆరు పంటల రైతు, బయనపల్లె


సాగులో ఉన్న కాలిఫ్లవర్


మిరప


చీనీ అంట్లు


బొప్పాయి

వంద శాతం లక్ష్యాన్ని పూర్తి చేయాలి

వేగవంతంగా సోలార్ ప్రాజెక్టుల భూసేకరణ : కలెక్టర్ చామకూరి శ్రీధర్


వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్

రాయచోటి (కలెక్టరేట్), ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పథకాల ప్రగతి సాధనలో వంద శాతం లక్ష్యాలను పూర్తి చేయాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం విజయవాడ ఏపీ సచివాలయంలోని సీఎస్ కాన్ఫరెన్స్ హాల్ నుంచి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. రాయచోటి కలెక్టరేట్ నుంచి కలెక్టర్‌తో పాటు డీఆర్‌వో మధుసూదన్‌రావు తదితరులు పాల్గొన్నారు. వీసీ అనంతరం అధికారులతో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఈనెల 19వ తేదీ మూడవ శనివారం స్వర్ణ ఆంధ్ర- స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాలను పటిష్టంగా నిర్వహించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఉచిత ఇసుక పథకంలో భాగంగా జిల్లా అవసరాలకు తగినంత ఇసుక నిల్వలను సిద్ధం చేసుకోవాలన్నారు. పీఎం కుసుమ్ కార్యక్రమం ద్వారా జిల్లాలో సోలార్ ప్రాజెక్టుకు అవసరమైన భూసేకరణను వేగవంతంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. వేసవిలో జిల్లాలో ఎక్కడ కూడా తాగునీటి ఎద్దడి తలెత్తకుండా అధికారులు ముందస్తుగా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. జిల్లాలో చేపట్టిన ఎంఎస్ఎంఈల సర్వేను పటిష్టంగా నిర్వహించాలన్నారు. ఉద్యం డేటా, ఎంఎస్ఎంఈ డేటా తేడాలు ఉండరాదన్నారు. అనంతరం వివిధ అంశాల్లో తగు సూచనలు జారీ చేశారు. సమావేశంలో సంబంధిత జిల్లా అధికారులు పాల్గొన్నారు.

పరీక్షలు, మార్కులే జీవితం కాదు

కస్తూర్బా విద్యార్థినుల అవగాహన కార్యక్రమంలో డీఈవో సుబ్రమణ్యం



సమావేశంలో మాట్లాడుతున్న డీఈవో సుబ్రమణ్యం

రాయచోటిటౌన్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు పరీక్షలు, మార్కులే జీవితం కాదని, బాలికలు అన్నింటిలో ఆత్మ విశ్వాసంతో ముందుకు నడవాలని డీఈవో డాక్టర్ సుబ్రమణ్యం తెలిపారు. గురువారం రాయచోటి పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జిల్లా పరిధిలోని మదనపల్లె డివిజన్‌లో గల కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయ విద్యార్థినులు, వారి తల్లిదండ్రులకు సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో జిల్లా జీసీడీవో మధుమతి అధ్యక్షతన పరీక్షలు, మార్కులే జీవితమా..? అనే అంశంపై కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి సమాజంలో పరీక్షలు మార్కులే జీవితం అనుకోకుండా ఇతర ఎన్నో రకాల రంగాల్లో విద్యార్థులు రాణిస్తూ ముందుకు నడవాలన్నారు. మానసిక వైద్య నిపుణులు రాధిక మాట్లాడుతూ ఇటీవల కాలంలో పరీక్షల్లో మార్కులు తక్కువ వచ్చాయని, ఉత్తీర్ణత సాధించలేదన్న వివిధ కారణాలతో కొంత మంది విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని, అది చాలా తప్పు అన్నారు. ప్రముఖ మోటివేషన్ స్పీకర్, పోలీసు అధికారి రాంమూర్తి మాట్లాడుతూ పదవ తరగతి పరీక్షా ఫలితాలే విద్యార్థుల అంతిమ లక్ష్యం కారాదని, బాలికలు ఆత్మవిశ్వాసంతో ముందుకెళితే ఉత్తమ ఫలితాలు సాధ్యమవుతాయన్నారు. సైక్రియాట్రిక్ సోషల్ వర్కర్ డాక్టర్ గౌతమి, ఫోర్డ్ సంస్థ సభ్యురాలు సుబాషిణి, సమగ్ర శిక్ష పూర్వ సెక్టోరల్ ఆఫీసర్ పఠాన్ మహమ్మద్‌ఖాన్, కేజీబీవీ ప్రిన్సిపాల్స్, బాలికలు పాల్గొన్నారు.

రూ.350 వేతనం వచ్చేలా పనిచేయాలి

● డ్వామా పీడీ వెంకటరత్నం


ఉపాధి పనులను పరిశీలిస్తున్న పీడీ వెంకటరత్నం

రామాపురం, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): రోజువారీ వేతనం రూ.350 వచ్చేలా ఉపాధి కూలీలు పనిచేయాలని పీడీ వెంకటరత్నం అన్నారు. మండలంలోని హసనాపురం పంచాయతీలో గురువారం ఉపాధి హామీ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా రైతు నీటికుంట పనులు, పశువుల నీటితొట్టెలు, పశుగ్రాసం, హార్టికల్చర్ పనులను పరిశీలించారు. 3 నెలలుగా డబ్బు రాలేదని కూలీలు పీడీ దృష్టికి తీసుకురాగా త్వరలో వస్తాయని తెలిపారు. రూ.350 రోజు వారి వేతనం వచ్చేలా కూలీలచే పనిచేయించాలని అధికారులకు సూచించారు. రైతులకు హార్టికల్చర్, పశువుల నీటి తొట్టె పనులు, ఉపాధి హామీ పథకం కింద మంజూరు చేస్తామని రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. మండలంలో మంజూరైన ఫారంపాండ్స్, పశువుల నీటి తొట్టె పనులు ఈనెల చివరికి పూర్తి చేయాలని సిబ్బందిని ఆదేశించారు. ఈయన వెంట లక్ష్మీనరసయ్య, ఏపీవో పెంచలయ్య, ఈసీ ఓబులేసు, టీఏ చంద్రశేఖర్, ఫీల్డ్ అసిస్టెంట్లు రవిశంకర్‌రెడ్డి, పక్కీర్‌రెడ్డి, అల్లా బకషులు పాల్గొన్నారు.

కేక్ తిని ఐదుగురు చిన్నారులకు అస్వస్థత


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న చిన్నారులు

రామసముద్రం, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): రామసముద్రం మండల కేంద్రంలోని ఓ బేకరీలోని హనీ కేక్ తిని ఐదుగురు చిన్నారులు అస్వస్థతకు గురయ్యారు. మండల కేంద్రంలోని ఆంజనేయస్వామి కాలనీకి చెందిన సుధీర్ (11), మధుశ్రీ (9), దర్శన్ (8), భవ్య (5), శ్రీధర్ (2) అస్వస్థత గురై వాంతులు చేసుకున్నారు. వీరికి కుటుంబ సభ్యులు పుంగనూరు ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నారు. పిల్లల పరిస్థితి నిలకడగా ఉన్నట్లు సమాచారం. ఈ విషయమై బేకరీ యజమాని మాట్లాడుతూ హనీ కేక్‌ను ఉదయం ఎనిమిది గంటలకు తీసుకెళ్లారని, కానీ సాయంత్రం 6 గంటలకు పిల్లలు అస్వస్థతకు గురి కావడంతో ఏమీ జరిగిందో తెలియడం లేదని చెప్పారు.

పెండింగ్ కేసులు త్వరితగతిన పరిష్కరించాలి

● ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు


మాట్లాడుతున్న ఎస్పీ

రాయచోటిటౌన్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): పెండింగ్ కేసులను వేగవంతంగా పరిష్కరించడమే కాకుండా నిషేధిత మత్తు పదార్థాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు పోలీసు అధికారులకు సూచించారు. గురువారం జిల్లా పోలీసు కార్యాలయంలో రాయచోటి సబ్ డివిజన్ పరిధిలోని పోలీసు అధికారులతో నెలవారీ నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న కేసులపై నిశితంగా సమీక్ష జరిపి పోలీసు అధికారులకు పలు సూచనలు చేశారు. గంజాయి రవాణా, విక్రయాలపై దాడులు చేయాలని ఆదేశించారు. క్రికెట్ బెట్టింగ్, జూదం జిల్లాలో ఎక్కడా జరగకుండా కఠినం గా వ్యవహరించాలని ఆదేశించారు. చైన్ స్నాచింగ్‌లు జరగకుండా తగిన చర్యలు తీసుకోవాలని, గతంలో చైన్ స్నా చింగ్‌కు పాల్పడిన నేరస్తులపై నిఘా ఉంచాలన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎం.వెంకటాద్రి, రాయచోటి సబ్ డివిజన్ పరిధిలోని సీఐలు, ఎస్ఐలు సంబంధిత పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఉన్నతమైన లక్ష్యం నిర్దేశించుకోవాలి

● అసిస్టెంట్ ప్రొఫెసర్ సుభాషిణి


నందినికి బంగారు పతకం అందజేస్తున్న సుభాషిణి

పీలేరు రూరల్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి); ఉజ్వల భవిత కోసం విద్యార్థులు ఉన్నతమైన లక్ష్యాలు నిర్దేశించుకోవాలని తిరుపతి పద్మావతి మహిళా యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ యర్రదొడ్డి సుభాషిణి తెలిపారు. గురువారం పీలేరు బాలికల ఉన్నత పాఠశాలలో 2023-24 విద్యాసంవత్సరం పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో తెలుగులో 99 శాతం మార్కులు సాధించి ప్రథమ స్థానంలో నిలిచిన పి.నందినికి బంగారు పతకం, ప్రశంసాపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ 1993వ సంవత్సరంలో ఇదే పాఠశాలలో పదవ తరగతి చదవడం వల్లే తాను ఆరోజు ఈ స్థాయికి చేరానని తెలిపారు. తన తల్లిదండ్రులు చందన, కృష్ణారెడ్డిల జ్ఞాపకార్థం ఏటా తెలుగులో ప్రథమ స్థానం సాధించిన విద్యార్థినికి బంగారు పతకంతో పాటు ప్రశంసాపత్రం అందచేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం ఫౌజియా బేగం, ఉపాధ్యాయులు జానం సుజాత, గంగయ్య, శ్రీకళ, ఉమామహేశ్వరి, రెడ్డిదీపారాణి, ఇంద్రాణి, ప్రసన్నలక్ష్మి, రాధారాణి, శైలజ విద్యార్థులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ద్విచక్ర వాహనం దగ్ధం


కాలిపోతున్న ద్విచక్రవాహనం

నిమ్మనపల్లి, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొనడంతో ఒకరికి గాయాలు కాగా ద్విచక్రవాహనానికి మంటలు చెలరేగి పూర్తిగా కాలిపోయింది. పోలీసుల కథనం మేరకు.. రామసముద్రం మండలం చెంబకూరుకు చెందిన హరీష్‌కుమార్‌రెడ్డి గురువారం తన ద్విచక్ర వాహనంపై నిమ్మనపల్లికు వస్తుండగా ముష్టూరు పంచాయతీ చల్లావారిపల్లి సమీపంలో మదనపల్లి మండలం కొత్తఇండ్లకు చెందిన గురువంశీ మదనపల్లికి వెళుతుండగా రెండు వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో హరీష్‌కుమార్‌రెడ్డికి గాయాలు కాగా అతడిని 108 వాహనంలో మదనపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. హరీష్‌కుమార్‌రెడ్డికి చెందిన ద్విచక్రవాహనం కింద పడడంతో మంటలు చెలరేగి పూర్తిగా కాలిపోయింది. విషయం తెలుసుకొన్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు.

భర్త, అత్తపై వరకట్నం వేధింపుల కేసు

రామసముద్రం, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): వరకట్నం తీసుకురావాలని భర్త సునీల్‌ప్రతాప్, అత్త గంగులమ్మ తనను వేధిస్తున్నారని లావణ్య గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ కథనం మేరకు.. మండలంలోని మాలేనత్తం పంచాయతీ ఎర్రపసెట్టిపల్లెకు చెందిన బూవిగాళ్ల నారాయణప్ప కుమార్తె లావణ్య (23)కు పెద్దపంజాణి మండలానికి చెందిన సునీల్‌ప్రతాప్‌తో వివాహమైంది. అయితే భర్త, అత్త తనను వరకట్నం తీసుకురావాలని వేధిస్తున్నారని లావణ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

31లోపు ఈకేవైసీ చేసుకోండి

మదనపల్లె అర్బన్, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): ఈనెల 31వ తేదీలోపు రేషన్ కార్డుదారులు ఈకేవైసీ చేసుకోవాలని మదనపల్లె సీఎస్ డీటీ ఫిరోజ్‌ఖాన్ తెలిపారు. గురువారం తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్వోలు, ఎండీయూలతో సమావేశం నిర్వహించారు. ఆయా రేషన్ డీలర్ల పరిధిలో ఉన్న కార్డుదారులందరూ ఈకేవైసీ చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో గోడామ్ డీటీ సుబ్రహమ్మణ్యం, రేషన్ డీలర్ల అధ్యక్షుడు ఇమామ్‌ఖాసీమ్, డీలర్లు పాల్గొన్నారు.

80 శాతం సబ్సిడీతో డ్రోన్లు మంజూరు

● వ్యవసాయాధికారి చంద్రానాయక్


డ్రోన్ వినియోగంపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

రాయచోటి (కలెక్టరేట్), ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): 80 శాతం సబ్సిడీతో ప్రభుత్వం రైతు సంఘాలకు డ్రోన్లను అందిస్తోందని వాటిని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వ్యవసాయశాఖ అధికారి చంద్రనాయక్ తెలిపారు. కిసాన్ డ్రోన్లపై జిల్లా స్థాయి వర్క్‌షాప్ గురువారం కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ అధికారి కిసాన్ డ్రోన్ పథకం మార్గదర్శకాలను వివరించారు. ప్రభుత్వం రైతు సంఘాలకు 80 శాతం సబ్సిడీపై డ్రోన్లను అందిస్తోందని, రైతులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. డ్రోన్‌లు ఉపయోగించడం వల్ల పురుగు మందుల పిచికారీ ఖర్చు తగ్గడంతో పాటు ఎకరం పిచికారీ 10 నిమిషాల్లో పూర్తవుతుందన్నారు. జిల్లాకు 34 డ్రోన్లు మంజూరయ్యాయని, రైతు సంఘాలు తమ గ్రూపు ఖాతాలో 50 శాతం జమ చేస్తే బ్యాంకులు 50 శాతం రుణం జారీ మంజూరు చేస్తాయని చెప్పారు. డ్రోన్ గ్రౌండింగ్ తర్వాత ప్రభుత్వం రైతు గ్రూప్ ఖాతాకు 80 శాతం సబ్సిడీని విడుదల చేస్తుందన్నారు. రైతు సంఘాలకు రుణాలు మంజూరు చేయడానికి యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సిద్ధంగా ఉందని తెలిపారు. డ్రోగో డ్రోన్స్, విహంగా డ్రోన్ల కంపెనీల ప్రతినిధులు తమ డ్రోన్ల ప్రత్యేకతలను వివరించారు. కార్యక్రమంలో ఎల్‌డీఎం అంజనేయులు, యూనియన్ బ్యాంక్ మేనేజర్ పి.ప్రసాద్ పాల్గొన్నారు.

రూ.11 కోట్ల నష్టాల్లో పీలేరు ఆర్టీసీ

● నష్టాల సాకుతో 31 సర్వీసులు రద్దు ● హైదరాబాద్, విజయవాడ, చెన్నై సర్వీసులు ప్రతిపాదనలకే పరిమితం ● 87 సర్వీసులలో 73 ఆర్డినరీ బస్సులే


పీలేరు ఆర్టీసీ బస్‌స్టేషన్

పీలేరు రూరల్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): పీలేరు ఆర్టీసీ డిపో రూ.11 కోట్ల నష్టాల్లో కూరుకుపోయింది. ఎంతోకాలంగా ఇక్కడి నుంచి హైదరాబాద్, చెన్నై, విజయవాడ, తిరుమల తదితర ప్రాంతాలకు వెళ్లే సర్వీసులను నష్టాల సాకుతో రద్దు చేయడమే ఇందుకు ప్రధాన కారణమని పలువురు అభిప్రాయపడుతున్నారు. మరోవైపు డిపోలో ఉన్న ఎక్స్‌ప్రెస్ సర్వీసులను క్రమంగా రద్దు చేయడం, అదనంగా కొత్త సర్వీసులు రాకపోవడం, మెజార్టీ సర్వీసులు ఆర్డినరీ కావడమే ఇందుకు ప్రధాన కారణమని పలువురు కార్మికులు వాపోతున్నారు. 118 సర్వీసులతో ప్రయాణికుల సేవలో తరించిన పీలేరు డిపోలో ప్రస్తుతం 87 సర్వీసులకే పరిమితమైంది. నష్టాల సాకుతో 31 సర్వీసులను రద్దు చేయడం గమనార్హం. రద్దయిన సర్వీసులలో హైదరాబాద్, తిరుమల, చెన్నై, విజయవాడ తదితర సర్వీసులున్నాయి. పీలేరు ఆర్టీసీ డిపో నుంచి రోజుకు 35,735 కిలోమీటర్ల మేరకు బస్సులను నడుపుతూ సుమారు 30 వేల మంది ప్రయాణీకులను వారి గమ్యస్థానాలకు చేరవేస్తున్నారు. డీఎంతో పాటు డ్రైవర్లు, కండక్టర్లు, కార్యాలయ సిబ్బంది, గ్యారేజ్‌లో 431 మంది కార్మికులు పనిచేస్తున్నారు. రోజుకు రూ.15 లక్షలు కలెక్షన్ రావాల్సి ఉండగా 11 నుంచి 12 లక్షల రూపాయలు మాత్రమే వస్తోంది. ప్రధానంగా డిపో పరిధిలోని గ్రామీణ ప్రాంతాలకు నడుపుతున్న సర్వీసుల వల్లే భారీ నష్టాలను చవి చూడాల్సి వస్తోంది. ప్రతి మార్గంలో అనధికారికంగా ఆటోలు, జీపులు, ఇతర వాహనాలలో ప్రయాణీకులను తరలిస్తుండడంతో నష్టాలు తప్పడం లేదు.

సమష్టి కృషితో నష్టాలు అధిగమిస్తాం



సమష్టి కృషితో నష్టాలు అధిగమిస్తాము. ప్రధాన కూడళ్లలో డ్రైవర్, కండక్టర్లు రెండు నిమిషాలు బస్సులను ఆపి ప్రయాణీకులను ఎక్కించుకునేలా చర్యలు చేపట్టాము. ప్రయాణీకులే సంస్థకు ప్రధాన ఆర్థిక వనరు కావడంతో డ్రైవర్, కండక్టర్లు వారి పట్ల గౌరవంగా వ్యవహరించాలి. ప్రయాణికుల అవసరం మేరకు ప్రత్యేక సర్వీసులు నడుపుతాము.

- బి.నిర్మల, డిపో మేనేజర్, పీలేరు.

కొత్త సర్వీసులు నడపాలి



పీలేరు డిపో మనుగడను దృష్టిలో పెట్టుకుని కొత్త సర్వీసులను సుదూర ప్రాంతాలకు నడపాలి. పీలేరు నుంచి హైదరాబాద్, చెన్నై, తిరుమల, విజయవాడ, కర్నూలు మార్గాలలో కొత్త సర్వీసులు నడపాల్సిన అవసరం ఉంది. ఇదే విషయాన్ని ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లాము.

పీఎల్ఎం రాజు, ఎన్ఎంయూ ప్రధాన కార్యదర్శి

విశ్వం వేసవి శిక్షణ సమాచార పత్రిక ఆవిష్కరణ


సమాచార పత్రికను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డి, విశ్వనాథరెడ్డి

తిరుపతి(విద్య), ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): విశ్వం వేసవి శిక్షణ శిబిర సమాచార పత్రికను ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పి.చంద్రశేఖరరెడ్డి గురువారం ఆవిష్కరించారు. వరదరాజనగర్‌లోని విశ్వం విద్యాలయంలో చేపట్టిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ మాట్లాడుతూ జాతీయ స్థాయిలో నిర్వహించే సైనిక్, మిలటరీ, నవోదయ, పాలిటెక్నిక్ పోటీ పరీక్షలకు విశ్వం విద్యాసంస్థలు 35 సంవత్సరాలుగా అత్యుత్తమ శిక్షణనిస్తూ మంచి ర్యాంకులు సాధిస్తోందన్నారు. విద్యాసంస్థల అధినేత విశ్వనాథరెడ్డి మాట్లాడుతూ వేసవి సెలవులు వృధా కాకుండా పిల్లల భవిష్యత్తు దృష్ట్యా శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. మరింత సమాచారానికి 9399976999, 868888880లను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో అపుస్మా నాయకులు భాస్కర్‌రాజు, రామకృష్ణారెడ్డి, ఎస్.ఎం.బాషా, రఘునారాయణరావు, జనార్దన్‌రెడ్డి, వెంకటేశ్ బాబు పాల్గొన్నారు.

పోక్సో కేసులో ఇద్దరు అరెస్టు

వేంపల్లె, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): వేంపల్లె పట్టణంలో ఓ బాలికను కిడ్నాప్ చేసి అత్యాచారం చేసిన కేసులో నిందితులుగా ఉన్న ఫాజిల్, ఆనంద్‌లను అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చినట్లు ఎస్ఐ రంగారావు తెలిపారు. వారం రోజుల క్రితం బాలికను ఫాజిల్ అనే యువకుడు కిడ్నాప్ చేసి అత్యాచారం చేశాడు. ఇందుకు ఆనంద్ సహకరించాడని ఆరోపిస్తూ బాలిక తండ్రి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు వీరిద్దరిపై పోక్సో కేసు నమోదైంది. గురువారం నిందితులను అరెస్టు చేసి పులివెందుల కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించడంతో కడప సబ్‌జైలుకు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

వివాహిత అదృశ్యం

కొండాపురం, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన కొండాపురం గ్రామానికి చెందిన ఓ వివాహిత అదృశ్యమైంది. పోలీసుల వివరాల మేరకు... పట్టణానికి చెందిన మంజల లక్ష్మీదేవి (43) అనే వివాహిత బుధవారం హాస్పిటల్‌కు వెళుతున్నానని భర్తకు చెప్పి ఇంట్లో నుంచి వెళ్లిపోయింది. అయితే ఆమె ఎంతకూ తిరిగి రాకపోవడంతో భర్త గురప్ప పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కాగా ఈమెకు ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నాడు. భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు కొండాపురం ఎస్సై ప్రతాప్‌రెడ్డి తెలిపారు.

రేషన్ కార్డు ఈకేవైసీ...



● చూసుకోండిలా.... చేసుకోండిలా

● ఈనెల 30 వరకు గడువు


ప్రొద్దుటూరు రూరల్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): ఈకేవైసీ చేయించుకోవాలి... లేకుంటే రేషన్ పంపిణీ నిలుపుదల చేస్తారు... ఇది రెండు నెలలుగా ఎక్కడ విన్నా వినపడుతున్న మాటలు. అయితే అసలు తాము ఈకేవైసీ చేయించుకోవాలో లేదో.. లేకపోతే ఎక్కడ చేయించుకోవాలో తెలియక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుకు రేషన్‌కార్డే కొలమానం. ప్రతి అయిదు సంవత్సరాలకు ఒకసారి కేంద్ర ప్రభుత్వ సూచనల మేరకు అందులో వివరాలు నవీకరించాల్సి ఉంది. చిన్నపిల్లలను చేర్చడం, చనిపోయిన వారి పేర్లను తొలగించాలి. అప్పుడే పథకాలకు ఎంత మంది అర్హులు వంటి విషయాలు తెలుస్తాయి. ఈకేసీవైసీ పెండింగ్ ఉన్న వారి జాబితా ఇప్పటికే ఆయా సచివాలయాలు, రేషన్ డీలర్ల వద్ద ఉంది. వారి వాద్దకు వెళితే వివరాలు నమోదు చేస్తారు. ఇలాంటివారు ఆన్‌లైన్‌లో ఈకేవైసీ స్టేటస్‌ను సొంతంగా చూసుకోవచ్చని అధికారులు చెబుతున్నారు. గత నెల 30 వరకు ఉన్న ఈ గడువును ఈనెల చివరి వరకు పెంచారు. ఆన్‌లైన్ ఈకేవైసీ స్టేటస్ సొంతంగా ఇలా తెలుసుకోవచ్చు.



ఈ-పాస్ యంత్రంలో..

రేషన్ డీలర్/ఎండీయూ వాహనంలో ఈ-పాస్ యంత్రం ఉంటుంది. దానిలో మీ రేషన్‌కార్డు వివరాలు నమోదు చేస్తే సభ్యుల వివరాలు వస్తాయి. ఎరుపు రంగు గడియలో పేర్లు ఉంటే ఈకేవైసీ పెండింగ్ ఉన్నట్లు. ఆకుపచ్చ రంగులో ఉంటే వారిది ఈకేసీవైసీ పూర్తయినట్లు. ఎరుపు రంగు గడియలో పేరు ఉన్న వారు ఆధార్ సంఖ్యను నమోదు చేసి వేలిముద్ర వేస్తే ఈకేవైసీ పూర్తవుతుంది.



ఆన్‌లైన్‌లోనూ ఇలా...

గూగుల్ వెబ్‌బ్రౌజ్‌లో ఈపీడీఎస్1 అని నమోదు చేసి ఎంటర్ నొక్కండి. డిపార్టుమెంట్ ఆఫ్ కన్స్యూమర్ ఎఫైర్స్, ఫుడ్ అండ్ సివిల్‌సప్లై ఏపీ అనే వెబ్‌సైట్ తెరచుకుంటుంది. దానిలో రేషన్ కార్డు విభాగంలో ఆరు రకాల ఆప్షన్లు 'న్యూ' అనే పేరుతో కనిపిస్తాయి. ఈపీడీఎస్ అప్లికేషన్ సెర్చ్, రైస్‌కార్డు సెర్చ్ రెండు ఆప్షన్లలో ఒకదానిని క్లిక్ చేసి రేషన్‌కార్డు నంబరు నమోదు చేస్తే అందులో ఉన్నవారి పేర్లు వస్తాయి. ఆయా పేర్లు ఎదురుగా ఎస్ అని ఉంటే ఈకేవైసీ అయినట్లు, అలా కాకుండా నో కానీ, ఇంకేమైనా ఉంటే మాత్రం ఈకేవైసీ చేయించుకోవాల్సిందే. డీలర్ లేదా రేషన్ బండి వద్ద ఈ-పాస్ యంత్రంలో వేలిముద్ర వేసి ఈకేవైసీని పూర్తి చేసుకోండి. దీనికి ఏప్రిల్ 30 వరకు మాత్రమే గడువు ఉంది. అయిదు సంవత్సరాలలోపు, 80 సంవత్సరాలు పైబడిన వారికి ఈకేసీవైసీ అవసరం లేదు. మిగిలిన వారంతా విధిగా చేయించుకోవాల్సిందే.

పనితీరు మెరుగుపరుచుకోకపోతే చర్యలు తప్పవు

● ట్రాన్స్‌కో సిబ్బందికి ఎస్ఈ రమణ హెచ్చరిక



సబ్ స్టేషన్ వద్ద విద్యుత్ లైన్లను పరిశీలిస్తున్న ట్రాన్స్‌కో ఎస్ఈ రమణ

చెన్నూరు, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో పనితీరు బాగుండాలని.. ఇష్టానుసారంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని ట్రాన్స్‌కో ఎస్ఈ రమణ సిబ్బందిని హెచ్చరించారు. గురువారం చెన్నూరు విద్యుత్ కార్యాలయాన్ని ఆకస్మిక తనిఖీ చేసిన ఆయన మండలంలోని పలు ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ తీగలను పరిశీలించారు. పలుచోట్ల ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ లైన్లు తక్కువ ఎత్తులో ఉండటం గమనించి.. వెంటనే సరిచేయాలని ఆదేశించారు. వేసవికాలంలో విద్యుత్ సరఫరాలో అవాంతరాలు ఏర్పడితే ప్రజలు ఇబ్బందులు పడతారని.. సిబ్బంది లైన్ల వెంట తిరుగుతూ ఏమైనా లోపాలుంటే గుర్తించి ముందస్తు మరమ్మత్తులు చేపట్టాలని సూచించారు. డీఈ వెంకటేశ్వర్లు, ఏఈ రామలింగారెడ్డి, సబ్ ఇంజనీరు స్రవంతి పాల్గొన్నారు.

ప్రైవేటు పాఠశాలల్లో ఉచిత ప్రవేశాలకు దరఖాస్తులు

కడప ఎడ్యుకేషన్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): ప్రైవేటు పాఠశాలల్లో 2025-26 అకాడమిక్ సంవత్సరానికి సంబంధించి ఆర్టీఈ 2009 ప్రకారం ఉచిత ప్రవేశాలు పొందడానికి దరఖాస్తులు ఆన్‌లైన్‌లో ఆహ్వానిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి షంషుద్దీన్, సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్టు కో ఆర్డినేటర్ నిత్యానందరాజులు సంయుక్త ప్రకటనలో తెలిపారు. అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో రెండు ప్రవేశాలు ఉంటాయని తెలిపారు. ప్రతి ప్రైవేటు పాఠశాలలో కూడా ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొంటున్న, బలహీన వర్గాల విద్యార్థులకు 25శాతం సీట్లు కేటాయించాల్సి ఉంటుందన్నారు. ఐదేళ్లు నిండిన వారికే 1వ తరగతిలో మాత్రమే ప్రస్తుతం అడ్మిషన్లు ఇవ్వాల్సి ఉంటుందన్నారు. సీబీఎస్ ఈ, ఐసీఎస్ఈ, ఐబీ సిలబస్ ఉన్న పాఠశాలల్లో ప్రవేశానికి 31.03.2025 నాటికి, స్టేట్ సిలబస్ పాఠశాలల్లో ప్రవేశానికి 01.06.2025 నాటికి ఐదేళ్లు నిండి ఉండాలన్నారు. ఈనెల 28 నుంచి వచ్చేనెల 15 వరకు విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

స్వచ్ఛభారత్‌కు అందరూ సహకరించాలి



కొండపేటలో పర్యటిస్తున్న స్వచ్ఛభారత్ మిషన్ డైరెక్టరు స్వప్న

చెన్నూరు, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛభారత్‌కు ప్రజలు సహకరించాలని.. తద్వారా గ్రామీణ ప్రాంతాలు ఆరోగ్యంతో విలసిల్లి ఆదాయం దిశగా అడుగులు వేస్తాయని స్వచ్ఛభారత్ మిషన్ కేంద్ర పరిశీలన డైరక్టరు దేవిరెడ్డి స్వప్న అన్నారు. మండలంలోని కొండపేట, చెన్నూరులలో గురువారం స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టరు ఊర్మిలాదేవితో కలిసి పరిశీలించారు. ఈసందర్భంగా రెండు పంచాయతీల్లో ఎస్‌డబ్ల్యుపీసీలో ఉన్న వర్మీకంపోస్టును పరిశీలించి హరిత రాయబారులతో మాట్లాడారు. అనంతరం ప్రజలతో మాట్లాడుతూ స్వచ్ఛభారత్‌కు సహకరించి.. తడి పొడి చెత్తలను వేర్వేరుగా గ్రీన్‌అంబాసిడర్లకు అందించాలన్నారు. ఈ చెత్త ఎస్‌డబ్ల్యుపీసీకి చేరితే వర్మీకంపోస్టుగా మారి రైతులకు ఆదాయ వనరుగా మారుతుందన్నారు. అలాగే గ్రామాల్లో స్వచ్ఛమైన తాగునీరు, పరిశుభ్ర వాతావరణం, శుభ్రమైన వీధులు, మంచి లైటింగ్ వ్యవస్థ ఉండాలన్నా అది ప్రజలతో సాధ్యమన్నారు. స్వచ్ఛ సంకల్పానికి ప్రతిఒక్కరూ కంకణబద్దులై ఉండాలని సూచించారు. డీపీఓ రాజ్యలక్ష్మి, జడ్పీ సీఈవో ఓబులమ్మ, సర్పంచ్‌లు తుంగ చంద్రయాదవ్, ఎంపీడీవో కిరణ్‌మోహన్‌రావు, ఎంపీపీ చీర్ల సురేశ్‌యాదవ్, ఎంపీటీసీ నాగిరెడ్డి, మాజీ సర్పంచ్ మోహన్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు, మండల అధికారులు, ఇంజనీర్లు పాల్గొన్నారు.

బీసీలను ఓటు బ్యాంకుగా చూసే పద్ధతికి స్వస్తి పలకండి

● బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు



మాట్లాడుతున్న కేశన శంకరరావు

కడప మారుతీనగర్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): బీసీలను ఓటు బ్యాంకుగా చూసే పద్ధతికి అన్ని రాజకీయ పార్టీలు స్వస్తి పలకాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేశన శంకరరావు పేర్కొన్నారు. గురువారం స్థానిక హరిత హోటల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 77 సంవత్సరాల స్వతంత్ర భారతంలో అణగారిన వర్గాలకు, ముఖ్యంగా వెనుకబడిన తరగతులైన ఓబీసీల జనగణన కులాల వారీగా వివరాలను శాస్త్రీయంగా సేకరించకపోవడం దురదృష్టకరమన్నారు. పలు రాజ్యాంగ సవరణల మేరకు ఎస్సీ, ఎస్టీలకు విద్య, విద్యా, ఉద్యోగ రంగాలతో పాటు చట్టసభలు, స్థానిక సంస్థలలో, ఇతర ఆర్థిక రంగాలలో జనాభా దామాషా ప్రకా రం రిజర్వేషన్‌లు అమలవుతున్నాయన్నారు. జాతీయ స్థాయిలో కాకా కాలేక్కర్, బీపీ మండల్ కమిషన్లు, రాష్ట్ర స్థాయిలో మురళీధరరావు, జస్టిస్ రోహిణి కమిషన్‌లు దేశ, రాష్ట్ర జనాభాలో సుమారు 52 శాతానికి పైగా బీసీలున్నారని తెలియపరచిన సంగతి తెలిసిందే అన్నారు. భవిష్యత్తులో చట్ట సభలలో ఓబీసీలకు రిజర్వేషన్లు ఇవ్వాలన్నా, ఓబీసీ మహిళలకు సబ్ కోటానిస్తూ మహి ళా రిజర్వేషన్ చట్టాన్ని సవరించాలన్నా, స్థానిక సంస్థలలో రిజర్వేషన్లు పెంచడంతో పాటు సంక్షేమ పథకాలు సక్రమంగా ఆయా అణగారిన కులాల దామాషా ప్రకారం అమలు చేయాలన్నా దేశ ప్రజలందరి జనగణనతో పాటు కుల గణన చేయాల్సి వుందన్నారు. బీసీ సంక్షేమ సంఘం యువజన విభాగం అధ్య క్షుడు క్రాంతికుమార్, జిల్లా అధ్యక్షుడు లింగమూర్తి, వర్కింగ్ ప్రెసిడెంట్ గోవిందు నాగరాజు, ప్రధాన కార్యదర్శి త్రివిక్రమ్, ఉపాధ్యక్షుడు కల్యాసుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

పశువైద్య కళాశాల ఏర్పాటు ఆత్మసంతృప్తినిచ్చింది : ఎమ్మెల్యే



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి

ప్రొద్దుటూరు టౌన్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): తన సుదీర్ఘ రాజకీయ జీవితంలో పశువైద్య కళాశాల ఏర్పాటు ఎంతో సంతృప్తినిచ్చిందని ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి పేర్కొన్నారు. గురువారం సాయంత్రం శ్రీ వెంకటేశ్వర పశువైద్య కళాశాల 12వ వార్షిక వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ మూగజీవాలకు సేవ చేయడం అదృష్టమని.. ఈ కోర్సు ఎంచుకున్న విద్యార్థులను అభినందించారు. ఈ కళాశాలలో చదివిన విద్యార్థులు కెనాడ, ఆస్ట్రేలియాల్లో పనిచేస్తున్నారని, హైదరాబాదుకు వెళ్లినప్పుడు ఇక్కడ చదివిన విద్యార్థులు తనను గుర్తుపట్టి పలుకరించడం సంతోషంగా ఉందన్నారు. శ్రీ వెంకటేశ్వర వెటర్నరీ యూనివర్శిటీ వీసీ జేవీ రమణ మాట్లాడుతూ కళాశాలలో చదివిన విద్యార్థులు దేశ, విదేశాల్లో మంచి గుర్తింపు పొందారని, అలాగే ఇక్కడి విద్యార్థులు క్రీడలు, జాతీయస్థాయి సెమినార్లలో ఉత్తమ ప్రతిభ కనపరుస్తున్నారన్నారు.

కలెక్టరు చెరుకూరి శ్రీధర్ మాట్లాడుతూ భారతదేశ ఆర్థిక వ్యవస్థ శరవేగంగా అభివృద్ధి చెందుతోందన్నారు. దేశ ఆర్థిక వ్యవస్థలో 64 శాతం వ్యవసాయ రంగం నుంచి లభిస్తుండగా 20 శాతం పశు సంపదనుంచి లభిస్తోందన్నారు. పశువైద్యానికి ప్రపంచ వ్యాప్తంగా అధిక ప్రాధాన్యత ఉందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో శ్రీ వెంకటేశ్వర వెటర్నరీ యూనివర్శిటీ డీన్ డాక్టర్ వీరబ్రహ్మయ్య, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సీహెచ్ శ్రీనివాసప్రసాద్, డాక్టర్ కల్యాణి, పశువైద్య అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బైకును ఢీకొట్టిన కారు యువకుడు మృతి



శ్రీకాంత్‌రెడ్డి (ఫైల్)

చక్రాయపేట, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గండి దేవస్థానం సమీపంలో గురువారం సాయంత్రం బైకును కారు ఢీకొట్టడంతో సుబ్బిరెడ్డి గారి శ్రీకాంత్‌రెడ్డి (30) అనే యువకుడు మృతి చెందాడు. వివరాల్లోకెళితే... శ్రీకాంత్‌రెడ్డి గురువారం మధ్యాహ్నం బైకులో వేంపల్లెకు వెళ్లి మొబైల్ కొనుగోలు చేశాడు. అక్కడ నుంచి చక్రాయపేటకు తిరిగి వస్తుండగా రాయచోటి వైపు నుంచి స్పీడుగా వస్తున్న కారు ఢీకొట్టి వెళ్లిపోయింది. దీంతో శ్రీకాంత్‌రెడ్డికి తీవ్ర గాయాలు కావడంతో వేంపల్లె ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. శ్రీకాంత్‌రెడ్డికి వివాహమై ఒక కుమారుడు ఉన్నారు.

బైకు అదుపుతప్పి యువకుడు..

మైదుకూరు రూరల్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆదిరెడ్డిపల్లె వద్ద బుధవారం అర్ధరాత్రి మోటర్‌సైకిల్ అదుపుతప్పి కల్వర్టను ఢీకొనడంతో ఒకరు మృతి చెందగా, మరొకరు గాయపడినట్లు పోలీసులు తెలిపారు. గిద్దలూరుకు చెందిన సిద్దయ్య, ఆయన సోదరుడు జమ్మయ్య చిరు వ్యాపారాలు చేసుకుంటూ జీవనం సాగిస్తుండేవారు. ప్రొద్దుటూరులోని బంధువుల ఇంటికి వెళ్లి డబ్బులు తీసుకొని గిద్దలూరుకు వెళుతుండగా ఆదిరెడ్డిపల్లె వద్ద బైకు అదుపుతప్పి రోడ్డు మరమ్మత్తుల్లో ఉన్న కల్వర్ట్‌ను ఢీకొంది. దీంతో సిద్దయ్య(23) అక్కడికక్కడే మృతి చెందగా, జమ్మయ్య గాయపడ్డాడు. పోలీసులు కేసు నమోదు చేసి విచారిస్తున్నారు.

700 బస్తాల రేషన్ బియ్యం స్వాధీనం

ప్రొద్దుటూరు, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): రేషన్ బియ్యం అక్రమ రవాణా చేస్తున్న భారీ లారీని రూరల్ పోలీసులు పట్టుకున్నారు. గురువారం జమ్మలమడుగు బైపాస్ రోడ్డు నుంచి మైదుకూరు రోడ్డు వైపు వెళుతుండగా లోడుతో వున్న లారీని పోలీసులు తనిఖీ చేయగా.. అందులో రేషన్ బియ్యం వున్నట్లు నిర్ధారించుకున్నారు.

జమ్మలమడుగుకు చెందిన కామేశు అనే బియ్యం వ్యాపారి రేషన్ బియ్యాన్ని అక్రమంగా జమ్మలమడుగు నుంచి మైదుకూరు మీదుగా బయటి ప్రాంతాలకు తరలిస్తున్నట్లు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. అనంతరం స్టేషనుకు తరలించారు. ఈమేరకు సివిల్ సప్లయ్ డిప్యూటీ తహసీల్దారు మల్లికార్జునకు రూరల్ పోలీసులు సమాచారం ఇవ్వడంతో ఆయన వెళ్లి లారీలోని బియ్యంను పరిశీలించి ..రేషన్ బియ్యంగా ధ్రువీకరించారు. కేసు నమోదు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఎర్రచందనం దుంగల మాయంపై ఏసీబీ కేసు

● 15 మంది అటవీ శాఖ అధికారులపై విచారణకు ఆదేశాలు

కలికిరి, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): కడప జిల్లా మైదుకూరు మండలం వనిపెంట అటవీ రేంజ్ పరిధిలోని గోడౌన్ నుంచి ఎర్రచందనం దుంగలు మాయమైన సంఘటనకు సంబంధించి నాలుగేళ్ల క్రితం ఏసీబీ నమోదు చేసిన కేసులో 15 మంది అటవీ శాఖ అధికారులపై విచారణకు గురువారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. 2021 జనవరి 29న వనిపెంట రేంజర్ కార్యాలయం, చెక్‌పోస్టు, గోడౌన్‌లపై ఏసీబీ అధికారులు ఆకస్మిక తనిఖీలు చేపట్టగా ఈ విషయం వెలుగులోకి వచ్చింది. మొత్తం 1037 కిలోల బరువున్న 37 ఎర్రచందనం దుంగలు మాయమైనట్లు ఏసీబీ గుర్తించింది. దీనిపై అప్పట్లోనే ఏసీబీ కేసు నమోదు చేసింది. వనిపెంట రేంజర్ సహా 15 మంది అటవీశాఖ అధికారులు, సిబ్బందిని బాధ్యులుగా నిర్ధారిస్తూ తదుపరి చర్యల కోసం ప్రభుత్వానికి నివేదించింది. ఈ నివేదికను పరిశీలించిన ప్రభుత్వం విచారణకు ఆదేశిస్తూ గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. విచారణ ప్రారంభమయ్యేలోగా సంజాయిషీలు చెప్పుకునే అవకాశం కల్పిస్తూ విడివిడిగా నోటీసులు జారీ చేసింది. ఉమ్మడి బాధ్యులుగా గుర్తించిన వారిలో వనిపెంట అటవీ రేంజరు సీహెచ్ దినేష్‌కుమార్‌రెడ్డి, ప్రొద్దుటూరు వైల్డ్‌లైఫ్ డివిజనల్ ఫారెస్ట్ ఆఫీసర్ ఎం.నాగార్జునరెడ్డి, జూనియర్ అసిస్టెంటు జి.విజ్ఞాథ, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్లు జి.హరినాథ రాజు, సీహెచ్ బాలలింగారెడ్డి, జి.ఆనందం (రిటైర్డు), ఎస్.సుధాకర్ (రిటైర్డు), వై.రజనీకుమార్, పి.కృష్ణ, పి.రమణయ్య, జివి రమణ, సి.ప్రసాదరావు (రిటైర్డు), ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్లు ఎస్.బాబు (రిటైర్డు), పి.ఓబులసుబ్బన్న (రిటైర్డు), పి.ఎస్.ఎన్.రాజు (రిటైర్డు) ఉమ్మడిగా విచారణను ఎదుర్కోవాల్సి వుంది. ఇందులో రిటైర్డు ఉద్యోగులపై పెన్షన్ రూల్స్ మేరకు విచారణ జరుగనుంది. రాష్ట్ర పర్యావరణ, అటవీ, సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి జి.అనంతరాము ఈ మేరకు మొత్తం 22 జీవోలను గురువారం విడివిడిగా జారీ చేశారు.

దొంగల కోసం పోలీసుల వేట

● పోలీసుల అదుపులో ఒకరు.. ఇద్దరు పరార్



దెబ్బతిన్న దొంగల కారు, పరిశీలిస్తున్న పోలీసులు

చాపాడు, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): సినీ ఫక్కీలో దొంగల కోసం పోలీసులు వేటాడారు. ఒక దొంగ పట్టుబడగా.. మరో ఇద్దరు చాకచక్యంగా తప్పించుకొని పారిపోయారు. వివరాలిలా... ప్రొద్దుటూరు నుంచి ముగ్గురు దొంగలు కారులో వెళుతున్నట్లు సమాచారం రావడంతో రూరల్ పోలీసు స్టేషన్‌కు చెందిన ఎస్ఐలు అరుణ్‌రెడ్డి, వెంకటసురేష్ సిబ్బందితో కలసి గురువారం మధ్యాహ్నం వారిని వెంబడించారు. చాపాడు మండలంలోని తిప్పిరెడ్డిపల్లె గ్రామం నుంచి రాజుపాళెం వైపు వెళుతుండగా ముందుగానే ఎస్ఐ అరుణ్‌రెడ్డి వారి రాకను తెలుసుకుని కారుకు ఎదురుగా రోడ్డుకు అడ్డంగా తన కారును నిలిపారు. అయితే దొంగలు తప్పించుకునేందుకు ఆ కారును ఢీకొట్టడంతో దొంగల కారుముందు భాగం దెబ్బతింది. పోలీసులు అడ్డుకోవడంతో కారులో ఉన్న ముగ్గురు దొంగలలో ఒక మహిళా దొంగ, మరొకరు పక్కనే ఉన్న పొలాల్లోకి వెళ్లి తప్పించుకుని పారిపోయారు. ఒకరిని అదుపులోకి తీసుకుని, కారును స్వాధీనం చేసుకున్నారు. ఆ సమయంలో దొంగలు వారి కారులోని ఒక బ్యాగును పక్కనే ఉన్న కాలువలో పడవేయగా స్వాధీనం చేసుకున్నారు. కాగా, దొంగల కారులో నకిలీ కారు నెంబర్ల ప్లేట్లు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు.

'హైకోర్టు ఉత్తర్వుల మేరకు భూవివాదం పరిష్కరించాలి'

ప్రొద్దుటూరు, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వుల మేరకు భూ వివాదం పరిష్కరించాలిని ఓ మాజీ సైనిక ఉద్యోగి కుటుం బ సభ్యులు డిమాండ్ చేశారు. మాజీ సైనికుడైన జింకా చెంగ్రాయుడుకు ప్రభుత్వం కేటాయించిన రామేశ్వరం పొలంలోని 5.02 ఎకరాల భూమిని తమ కుమార్తెల పేరుతో మ్యూటేషన్ చేయాలని కోరుతూ జింకా విజయలక్ష్మి తన కుమార్తెలతో కలిసి గురువారం స్థానిక తహసీల్దారు కార్యాలయం వద్ద బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా దివంగత మాజీ సైనికుని కుమార్తెలు చంద్రావతి, భవానిలు మాట్లాడుతూ మా భూమి మా పెద్దనాన్న కుమారుడు జింకా బ్రహ్మయ్య ఆధీనంలో ఉందన్నారు. ఆ భూమిలోకి ఇరువురిని దిగవద్దని 164 సెక్షన్ పెట్టారన్నారు. కానీ ఆ భూమిలో పంటను దొంగలు ఎవరో కోసుకుపోయారని వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తమకు న్యాయం జరిగే వరకు ఇక్కడి నుంచి కదిలేది లేదన్నారు. తహసీల్దారు గంగయ్య, డిప్యూటీ తహసీల్దారు సాయినాథ్‌రెడ్డిలు వారితో మాట్లాడారు. 164 సెక్షన్ ఉల్లంఘించి ఎవరు పంట కోసుకుపోయారో చర్యలు తీసుకోమని రూరల్ పోలీసులకు ఉత్తర్వులు ఇచ్చామన్నారు. విచారించి చర్యలు తీసుకుంటామన్నారు. హైకోర్టు జడ్జిమెంట్‌లో కూడా ఈ భూవివాదంపై విచారించి మాజీ సైనికునికి ఒక అవకావశం ఇవ్వమని చెప్పిందన్నారు. కావున మీకు భూమి ఆన్‌లైన్ చేసే విషయం మా చేతిలో లేదన్నారు. మేము ఇరుపార్టీలకు నోటీసులు ఇచ్చి వారి దగ్గర వున్న ఆధారాలు పరిశీలించి కలెక్టర్‌కు నివేదికను పంపామన్నారు. జేసీ, కలెక్టర్లు నిర్ణయం తీసుకుంటారని.. వారి ఆదేశాలనుసారం న్యాయం చేస్తామన్నారు. సాయంత్రం వరకు బైఠాయించిన వారు తహసీల్దారు గంగయ్య ఇచ్చిన హామీతో నిరసన విరమించారు.

వైవీయూకు రూ.10కోట్లతో ఎన్ఆర్ఎఫ్‌పీఏఐఆర్ ప్రాజెక్టు

కడప ఎడ్యుకేషన్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): యోగివేమన విశ్వవిద్యాలయానికి మెగా రీసెర్చ్ ప్రాజెక్టు మంజూరైంది. అనుసంధాన్ నేషనల్ రీసెర్చ్ ఫౌండేషన్ పార్టనర్‌షిప్స్ ఫర్ యాక్సిలరేటెడ్ ఇన్నోవేషన్ అండ్ రీసెర్చ్ (ఏఎన్ఆర్ఎఫ్ పీఏఐఆర్) పథకం కింద యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్‌తో కలిసి రూ.10కోట్లు నిధులు మంజూరయ్యాయి. అత్యున్నత స్థాయి పరిశోధన సంస్థలతో జత చేయడం ద్వారా మెంటార్‌షిప్ మోడల్‌లో పరిశోధకులు బాగా పనిచేయగల సామర్థ్యాన్ని పెంచడానికి ఈ పథకం రూపొందించారు. ఈ ప్రాజె క్టు కోసం యోగివేమన విశ్వవిద్యాలయంలో రోగనిర్ధారణ, మెటబాలిక్, ఇన్ఫెక్షన్స్, అంటువ్యాధుల చికిత్సలు, వ్యాధి నిఘా యంత్రాంగంపై దృష్టి సారించే మొత్తం 22 ప్రతిపాదనలను వివిధ విభాగాలలో కలిసి 27 మంది అధ్యాపకులు సమర్పించారు. ప్రాజెక్టు నిధులతో పరిశోధనలు ప్రారంభించనున్నారు. ఈ సందర్భంగా వైవీయూ వీసీ ప్రొఫెసర్ అల్లం శ్రీనివాసరావు మాట్లాడుతూ పరిశోధననిధులతో నాణ్యమైన పరిశోధనలు చేస్తామన్నారు. కార్యక్రమంలో వీసీతో పాటు మాజీ ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ కె.కృష్ణారెడ్డి, రిజిస్ట్రార్ పి.పద్మ, ప్రిన్సిపల్ ఎస్.రఘునాథరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

తెలుగుగంగ ఎస్ఈగా డి.వెంకట్రామయ్య

కడప, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): తెలుగుగంగ ప్రాజెక్టు సూపరింటెండెంట్ ఇంజనీరుగా డి.వెంకట్రామయ్యను మరోసారి ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు నీటిపారుదలశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. తెలుగుగంగ ఎస్ఈగా పనిచేసిన విజయగోపాల్ పదోన్నతిపై విజయవాడ వెళ్లారు. అప్పటి నుంచి ఇన్‌చార్జ్‌గా మునీర్‌బాషా పనిచేశారు. అయితే ప్రభుత్వం రెగ్యులర్ ఇరిగేషన్‌లో ఈఈగా పనిచేస్తున్న వెంకట్రామయ్యకు ఎస్ఈగా బాధ్యతలు అప్పజెప్పింది. గతంలో కూడా వెంకట్రామయ్య తెలుగుగంగ ఎస్ఈగా పనిచేసి ఉన్నారు.

పీలేరు రీ-సర్వే డీటీ బదిలీ

● మూడు నెలల్లో ఇద్దరు డీటీల బదిలీపై గుసగుసలు



పీలేరు, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): పీలేరు మండల రీ-సర్వే డిప్యూటీ తహసీల్దారు సుబ్రహ్మణ్యం కలెక్టరేట్‌కు బదిలీ అయ్యారు. జిల్లా ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు అందడంతో తహసీల్దారు భీమేశ్వర రావు గురువారం నుంచి రిలీవ్ చేయగా ఆయన వెంటనే కలెక్టరేట్‌లో రిపోర్టు చేసుకున్నారు. గడిచిన మూడు నెలల్లో ఇద్దరు డిప్యూటీ తహసీల్దార్లు పీలేరు నుంచి బదిలీ కావడంపై పలు గుసగుసలు వినిపించాయి. డీటీల బదిలీలు రాజకీయ కారణాలతోనే జరిగాయని, అధికార పార్టీ నేతలే తమకు అనుకూలమైన వారికి పోస్టింగులు ఇప్పించుకునేందుకు ఈ బదిలీ చేయించారనే పుకార్లు వ్యాపించాయి. ఈ ఏడాది ఫిబ్రవరి ప్రారంభంలో పీలేరు హెచ్‌డీటీగా పనిచేసిన రెడ్డప్పరెడ్డిని కలెక్టరేట్‌కు డిప్యూటేషన్‌పై బదిలీ చేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత జరిగిన బదిలీల్లో పీలేరుకు వచ్చిన రెడ్డప్పరెడ్డిని అనతికాలంలోనే బదిలీ చేశారు. ఆయన స్థానంలో మరొకరిని నియమించకుండా జిల్లా ఉన్నతాధికారులు కూడా తాత్సారం చేస్తున్న నేపథ్యంలో ఎంతో విజయవంతంగా విధులు నిర్వర్తిస్తున్న రీ-సర్వే డీటీని అదే తరహాలో కలెక్టరేట్‌కు డిప్యూటేషన్‌పై పిలుపించుకోవడం సర్వత్రా చర్చినీయాంశమైంది. డిప్యూటేషన్ ఆదేశాలు అందిన సుబ్రహ్మణ్యంను గురువారం తహసీల్దారు భీమేశ్వర రావు నేతృత్వంలో స్థానిక సిబ్బంది ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. పీలేరు మండలానికి హెచ్‌డీటీ, ఎలక్షన్ డీటీ, రీ-సర్వే డీటీ, సివిల్ సప్లైస్ డీటీ అంటూ నాలుగు డిప్యూటీ తహసీల్దారు పోస్టులు ఉన్నాయి. వాటిలో ఇది వరకే రెడ్డప్పరెడ్డి, గురువారం సుబ్రహ్మణ్యం వెళ్లిపోవడంతో రెండు ఖాళీలు ఏర్పడ్డాయి. అటు ప్రజాసంబంధాలు, రెవెన్యూ సమస్యలు, ఆక్రమణలు, కోర్టు వ్యవహారాలతో తహసీల్దారు కార్యాలయంలో నిత్యం పని ఒత్తిడి ఉంటుంది. అనునిత్యం వచ్చే అర్జీలతో పాటు కార్యాలయ పరిధిలో హైకోర్టులో 310 రిట్ పిటీషన్లు, 250 ఓస్ కేసులు, 5 లోకాయుక్త కేసులతో పాటు ప్రస్తుతం మండలంలోని వేపులభైలు గ్రామ పంచాయతీలో రీ-సర్వే పనులు చురుగ్గా సాగుతున్నాయి. కోర్టు కేసుల్లో డిప్యూటీ తహసీల్దార్ల పాత్ర ఎంతో కీలకమైనది. అటువంటి ఇద్దరు డిప్యూటీ తహసీల్దార్లు లేకపోవడం పట్ల సిబ్బంది ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వారి ఆందోళనను పరిగణలోకి తీసుకుని జిల్లా ఉన్నతాధికారులు కొత్త వారిని నియమిస్తారో లేక ఆలస్యం చేస్తారో వేచి చూడాలి.

హిస్టరీ బీవోఎస్ చైర్మన్‌గా ఖాజావలీ



మదనపల్లె టౌన్, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): ఎస్వీ యూనివర్శిటీ హిస్టరీ విభాగం బోర్డ్ ఆఫ్ స్టడీస్ (బీవోఎస్) చైర్మన్‌గా మదనపల్లెకు చెందిన డాక్టర్ ఖాజావలీ నియమితులయ్యారు. స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో హిస్టరీ అధ్యాపకుడిగా పనిచేస్తున్నారు. ఈ సందర్భంగా ఖాజావలీని ప్రిన్సిపాల్ కృష్ణవేణి, సహచర అధ్యాపకులు అభినందించారు.

పురస్కార గ్రహీతకు సన్మానం

పీలేరు, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): కందుకూరి వీరేశింగం విశిష్ట పురస్కారం అందుకున్న పీలేరు కళాకారుడు షేక్ ఖాదర్ బాషాను గురువారం యూటీఎఫ్ నాయకులు ఘనంగా సన్మానించారు. భవిష్యత్తులో మరిన్ని పురస్కారాలు అందుకోవాలని ఆకాంక్షించారు. స్థానిక ఎంఆర్‌సీలో జరిగిన ఈ కార్యక్రమంలో పీలేరు, కేవీపల్లె ఎంఈవోలు లోకేశ్వర రెడ్డి, రెడ్డిబాషా, యూటీఎఫ్ నాయకులు శివారెడ్డి, అక్రమ్ బాషా, విశ్వనాథరెడ్డి, కృష్ణమూర్తి, విజయ్‌కుమార్, సీఆర్‌పీలు, తదితరులు పాల్గొన్నారు.

ములకల చెరువు కేజీబీవీ విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది



అగ్నిప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి

● అగ్నిమాపక వారోత్సవాల్లో అధికారులు

పీలేరు రూరల్ 17 (ఆంధ్రజ్యోతి); అగ్ని ప్రమాదాల పట్ల విద్యార్థినులు అప్రమత్తంగా ఉండాలని పీలేరు అగ్నిమాపక అధికారి ఎస్.మస్తాన్ అన్నారు. గురువారం పీలేరు పట్టణ శివారు ప్రాంతం చిత్తూరు మార్గంలోని అంబేద్కర్ బాలికల గురుకుల పాఠశాలలో అగ్నిమాపక వారోత్సవాలలో భాగంగా అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన గ్యాస్, ఆయిల్ ప్రమాదాలు జరిగినప్పుడు మంటలను ఎలా అదుపు చేయాలో ప్రయోగాత్మకంగా చేసి చూపించారు. అగ్ని ప్రమాదాలు జరిగనపుడు 101, 08584-244399, 9963736587 నెంబర్లకు సమాచారం ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది నాగిరెడ్డి, హేమాద్రిరెడ్డి, చలపతి, క్రిష్ణమూర్తి, శ్రీనివాసులు, వెంకటేష్, రెడ్డిశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

వాల్మీకిపురంలో..

వాల్మీకిపురం, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): ప్రమాదాలు సంభవించినప్పుడు యువత ఆవేశానికి గురి కాకుండా అప్రమత్తంగా ముందుకెళ్లాలని వాల్మీకిపురం అగ్ని మాపక కేంద్రం అధికారి బాబయ్య పేర్కొన్నారు. అగ్ని మాపక వారోత్సవాలలో భాగంగా స్థానిక ఎన్టీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బాబు, ఫైర్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ములకలచెరువులో..

ములకలచెరువు, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): అగ్నిప్రమాదాల పట్ల అప్రమత్తంగా ఉండాలని అగ్నిమాపక కేంద్రం అధికారి నరసింహులు సూచించారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా గురువారం స్థానిక కస్తూర్బా గాంధీ గురుకుల విద్యాలయంలో విద్యార్థినులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎక్కడైనా అగ్నిప్రమాదాలు సంభవిస్తే తక్షణం తమకు సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది కృష్ణయ్య, గణేష్, వరభద్ర తదితరులు పాల్గొన్నారు.

మదనపల్లెలో..

మదనపల్లె అర్బన్, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా గురువారం మదనపల్లె పలు ప్రాంతాల్లో ర్యాలీ నిర్వహించారు. చిత్తూరు బస్టాండ్, ఆర్టీసీ బస్టాండ్, గొల్లపల్లె సర్కిల్ కరపత్రాలను పంపిణీ చేశారు. అనంతరం ప్రశాంతనగర్‌లోని శ్రీచైతన్య విద్యార్థులకు ఫైర్ మాక్ డ్రిల్, అగ్రిమాపక నివారణ పరికరాల గురించి అవగాహన కల్పించారు.

అకాల వర్షంతో నష్టపోయిన రైతులు

బి.కొత్తకోట, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): బి.కొత్తకోట నగరపంచాయతీ పరిధిలో బుధవారం రాత్రి కురిసిన అకాల వర్షానికి రైతులకు అనేక విధాలుగా నష్టం వాటిల్లింది. టమోట, మొక్కజొన్న పంటలు గాలివాన బీభత్సానికి నేలకొరిగాయి. అసలే ధరలు లేక కోత కూలీలు, ఖర్చు కూడా రావడం లేదని రైతులు అలమటిస్తున్నారు. కేవలం రూ.70లకు జూస్‌ఫ్యాక్టరీలకు తరలిస్తున్నారు. ఈ నేపథ్యంలో గాలివానతో పంటలు నేలకు వాలిపోవడంతో పంటనష్టాన్ని పరిశీలించి ఆదుకోవాలని బాధితరైతులు కోరుతున్నారు. దీనిపై ఏవో చంద్రశేఖర్ మాట్లాడుతూ అన్ని ఆర్బీకేలకు ఆయా గ్రామాలలో పంటనష్టం ఏ మేరకు జరిగిందనే విషయమై నివేదిక కోరామని, దాని మేరకు చర్యలు తీసుకుంటామన్నారు.

'కార్పొరేట్‌కు ధీటుగా ప్రభుత్వ విద్య'

కురబలకోట, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్యనందిస్తున్నట్లు ఉపాధ్యాయుడు రాజశేఖర్‌రెడ్డి అన్నారు. గురువారం మండంలోని మండ్యంవారిపల్లె, పూజారవాండ్లపల్లె తదితర గ్రామాలలో బడి ఈడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని విద్యార్థుల తల్లిదండ్రులను కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని విధాల అర్హత పొందిన సిబ్బంది ఉన్నారని, విద్యార్థుల కోసం ప్రభుత్వం అనేక వసతులు కల్పిస్తోందని, వాటిని సద్వినియోగం చేసుకుని విద్యలో రాణించాలని సూచించారు.

ప్రకృతి వ్యవసాయం.. రైతులకు లాభదాయకం



ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన ఆకు కూరలను ప్రదర్శిస్తున్న దృశ్యం

పెద్దతిప్పసముద్రం, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయం రైతులకు ఎంతో లాభదాయకమని ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పెర్కొన్నారు. గురువారం వెలుగు కార్యాలయలంలో వెలుగు ఏపీఎం హరి, మాస్టర్ ట్రైనర్ సి.రఘునాథ్, డిస్ట్రిక్ మోడల్ మేకర్ ట్రైనర్ సుబ్బరాముతో కలిసి ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల స్టాల్‌ను ఏర్పాటు చేశారు. అనంతరం ప్రకృతి వ్యవసాయ పద్ధతులపై రైతులకు వివరించారు. పైలెట్ ప్రాజెక్టు కింద మండలంలోని కందుకూరు, సంపతి కోట గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయం ద్వారా టమోటా, వంగ, గోరుచిక్కుడు, బెండ, బీర, ముల్లంగి, క్యారెట్ బీట్రూట్, క్యాప్సికం వంటి కూరగాయలను పండించి రైతులకు అవగాహన కల్పించేందుకు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఎలాంటి క్రిమిసంహారక మందులు లేకుండా స్వచ్ఛమైన సేంద్రియ ఎరువులు, కషాయాలతో పండించిన పంటలు, కూరగాయాలు, ఆకుకూరలను ప్రజలు ఎక్కువగా ఇష్టపడుతున్నారన్నారు. కార్యక్రమంలో వెలుగు సీసీలు, సంఘమిత్రాలు పాల్గొన్నారు.

పవన్‌కల్యాణ్ హామీలు ఏమయ్యాయి..?

● కార్మిక సమస్యలను పరిష్కరించాలని ఏఐటీయూసీ డిమాండు

మదనపల్లె అర్బన్, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): ఎన్నికల సందర్భంగా భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డును పునరుద్ధరించి, కోటి రూపాయలు జమ చేస్తామని చెప్పిన ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ హామీలు ఏమయ్యాయని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ ప్రశ్నించారు. గురువారం స్థానిక ఏఐటీయూసీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ అధికారంలోకి వచ్చి ఏడాది సమీపిస్తున్నా కూటమి ప్రభుత్వం కార్మికుల పట్ల నిర్లక్ష్యం వహిస్తోందన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సురేష్‌కుమార్, నియోజకవర్గ కార్యదర్శి ముబారక్, అధ్యక్షుడు రెడ్డెప్ప, పట్టణ కార్యదర్శి తిరుమల, జిల్లా కౌన్సిల్ సభ్యులు దేవా, వాసు, నాగరాజ, పృధ్వీరాజ్, శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమిత స్థలాలను క్రమబద్ధీకరించుకోండి

నిమ్మనపల్లి, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భూములను ఆక్రమించుకొని ఇళ్లు నిర్మించుకున్నవారు వాటిని క్రమబద్ధీకరించుకోవాలని తహసీల్దార్ అమరనాథ్ పేర్కొన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ జీవో నెంబరు 30ద్వారా అభ్యంతరం లేని ప్రభుత్వ భూములలో 2019 నుండి ఇళ్లు నిర్మించుకున్న వ్యక్తులకు ల్యాండ్ రెగ్యులైజేషన్ చేయనున్నట్లు తెలిపారు. ప్రభుత్వ మార్కెట్ వాల్యూను బట్టి సగం ధరకే రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని, మహిళల పేరు మీద మాత్రమే ఇళ్లను కేటాయిస్తామని తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

బీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలను యూనివర్శిటీగా ప్రకటించాలి

మదనపల్లె టౌన్, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): మదనపల్లెలోని బీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలను యూనివర్శిటిగా ప్రకటించాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు ప్రసన్నకుమార్, కార్యదర్శి అశోక్ డిమాండ్ చేశారు. గురువారం స్థానికంగా ఎస్ఎఫ్ఐ నాయకులు విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో ఏకైక పెద్ద విద్యాసంస్థగా వున్న బీటీ కళాశాలను గత ప్రభుత్వం ప్రభుత్వపరం చేసిందే కానీ, ఇక్కడ సరిపడ అధ్యాపకుల్ని నియమించలేదన్నారు. ఉన్న పీజీ కోర్సును ఎత్తివేసి, నాన్ టీచింగ్ స్టాఫ్ నియామకంలో పారదర్శకత పాటించలేదన్నారు. ప్రస్తుతం బీటీ కళాశాల ప్రభుత్వం ఆధీనంలోనే వున్నా ఎలాంటి నిధులు కేటాయించకపోవడం శోచనీయమన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నరసింహులు, రమణ, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

చిరుధాన్యాల ఆహారంతోనే ఆరోగ్యం

పెద్దమండ్యం, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి) చిరుధాన్యాల ఆహారం తీసుకోవడం వల్ల ఆరోగ్యవంతులుగా ఉంటామని ఐసీడీఎస్ సీడీపీవో నాగవేణి పేర్కొన్నారు. మండలంలోని సి.గొల్లపల్లి గ్రామ పంచాయతీ పసలవాండ్లపల్లి అంగన్వాడీ కేంద్రంలో గురువారం పోషణ్ పక్వాడా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సజ్జలు, రాగులు, సామలు, జొన్నలు వంటి పలు చిరుధాన్యాల ఆహారంతోనే మన పెద్దలు ఆరోగ్యవంతులుగా జీవించారని, వారిని మనం ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో అంగన్వాడీ సూపర్‌వైజర్ నౌజీయబేగం, సర్పంచ్ విశ్వనాధరెడ్డి, అంగన్వాడీలు పాల్గొన్నారు.

మాతా శిశువుల సంరక్షణే ధ్యేయం

బి.కొత్తకోట, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): మాతాశిశువుల సంరక్షణే అంగన్వాడీల ధ్యేయమని సీడీపీవో భాగ్యమ్మ పేర్కొన్నారు. పోషణ్‌పక్వాడా కార్యక్రమంలో భాగంగా గురువారం ఇందిరమ్మకాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులు, బాలింతలు, చిన్నారులు తీసుకోవాల్సిన పౌష్టకాహారం, ఆరోగ్యనియమాల గురించి వివరించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ హిజాద్‌ప్యారీ, జీయంఎస్కే నిర్మల, ఏఎన్‌యం, ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

అధికారుల నిర్లక్ష్యం కార్మికులకు శాపం

పీలేరు రూరల్ 17(ఆంధ్రజ్యోతి); అధికారుల నిర్లక్ష్యం ఆర్టీసీ కార్మికుల పట్ల శాపంగా మారిందని ఎన్ఎంయూ జిల్లా ప్రధాన కార్యదర్శి పీఎస్ఎం రాజు తెలిపారు. గురువారం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు పీలేరు ఆర్టీసీ గ్యారేజ్ వద్ద ఎన్ఎంయూ ఆధ్వర్యంలో కార్మికులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2019 సర్క్యులర్ అమలు చేయాలని, లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్ మంజూరు చేయాలని, నైట్ అలవెన్స్ రూ.150 నుంచి 400 పెంచాలని, ఈహెచ్ ఎస్‌కు బదులుగా పాత వైద్య విధానం అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో డిపో అధ్యక్షుడు పీవీ రమణ, కార్యదర్శి ఆదినారాయణ, డిపో కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పశువుల మంద భూమిని కాపాడాలి

కలకడ, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని దేవళపల్లెలో ఆక్రమణలకు గురైన పశువుల మంద భూమిని కాపాడాలని గ్రామస్థులు రెవెన్యూ అధికారులకు విన్నవించుకున్నారు. ఈ మేరకు గురువారం వారు తహశీల్దార్ ఫణికుమార్‌కు వినతిపత్రం అందించారు. గ్రామంలోని సర్వే నెంబరు 309లో ఉన్న స్థలంలో తరతరాలుగా సంక్రాంతి పండుగ జరుపుకుంటున్నామని, గ్రామానికి చెందిన కొందరు ఆ భూమిని గుట్టుచప్పుడు కాకుండా ఆన్‌లైన్ చేయించుకున్నారని ఫిర్యాదులో తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ వెంకటరమణ, గ్రామస్థులు పాల్గొన్నారు.

ప్రోత్సాహకాలపై అవగాహన కల్పించాలి

పీలేరు, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం పండ్ల తోటల పెంపకానికి అందిస్తున్న ప్రోత్సాహకాలపై విస్తృత ప్రచారం, అవగాహన కల్పించాలని ఎంపీడీవో శివశంకర్ తెలిపారు. గురువారం ఆయన స్థానిక ఉపాధి హామీ కార్యాలయంలో మండలంలోని రైతు సేవా కేంద్రాల సిబ్బంది, ఫీల్డ్ అసిస్టెంట్లకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన పండ్ల తోటల పెంపకానికి ఆసక్తి, అర్హత ఉన్న రైతులను గుర్తించి దరఖాస్తులు స్వీకరించాలన్నారు. పీలేరు ఉద్యాన శాఖాధికారి సుకుమార్‌రెడ్డి మాట్లాడుతూ మొదటి మూడు సంవత్సరాలకు 40 శాతం సబ్సిడీ ఉంటుందన్నారు. పూలు, గడ్డి పెంపకానికి కూడా రాయితీ ఉంటుందని ఏపీవో అశోక్ రెడ్డి తెలిపారు.

నలుగురిపై కేసు నమోదు

పెద్దతిప్పసముద్రం ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): చింతకాయలు కోసుకునే విషయంలో తలెత్తిన వివాదంలో నలుగురిపై కేసు నమోదైన సంఘటన పెద్దతిప్పసముద్రం మండలంలో చోటు చేసుకుంది. పీటీఎం ఎస్ఐ హరిహరప్రసాద్ అందించిన సమాచారం మేరకు.. మండలంలోని ఓ మసీదు స్థలంలో ఉన్న చింతచెట్టు నుండి ముత్తువల్లి షేక్ అహ్మద్ చింతకాయలను కోశాడు. కాగా ఈ చింతచెట్టులో తమకు వాటా ఉందని ఇదే గ్రామానికి చెందిన షేక్ వలిసాబ్ కుమారులు, అతని తమ్ముని కుమారులు దాడి చేశారు. ఈ మేరకు షేక్ అహ్మద్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

పీఎం విశ్వకర్మ యోజన పనిముట్ల పంపిణీ

రామసముద్రం, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని చెంబకూరు పంచాయతీ కేంద్రంలో బుధవారం పీఎం విశ్వకర్మ యోజన పథకం ద్వారా లబ్ధిదారులకు రూ.15000 విలువ చేసే పనిముట్లను బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కృష్ణమూర్తి ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కృష్ణమూర్తి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం 18రకాల కుల వృత్తుల వారిని ఆర్థికంగా ఆదుకునేందుకు ఈ పథకాన్ని ప్రవేశపెట్టిందని, 2023-24సంవత్సరానికి గాను ఎంపికైన 13మందికి ఈ పనిముట్లు అందించినట్లు ఆయన తెలిపారు.

గోవులకు పశుగ్రాసం వితరణ

తంబళ్లపల్లె, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): తంబళ్లపల్లె సమీపంలోని ప్రసిద్ధ పుణక్షేత్రమైన మల్లయ్యకొండ దేవస్థానం గోవులకు ట్రాక్టరు లోడు పచ్చి గడ్డిని వితరణగా అందజేశారు. తంబళ్లపల్లె సాలివీధికి చెందిన రైతు మల్లికార్జునరెడ్డి ట్రాక్టరు లోడు పచ్చిగడ్డిని గురువారం మల్లయ్యకొండ అన్నదాన ట్రస్టు సభ్యులకు అందించారు. అనంతరం వారు ట్రాక్టరుతో మల్లయ్యకొండకు చేరవేశారు. గోవులకు మేత అందించిన దాతను స్థానికులు, భక్తులు అభినందిస్తున్నారు.

యోగా శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

పీలేరు, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): ఈనెల 25వ తేదీ నుంచి జరగనున్న వేసవి యోగా శిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని పీలేరులోని 'షీ' సంస్థ అధ్యక్షురాలు పీవీఎస్ లక్ష్మి తెలిపారు. శిక్షణ పూర్తి చేసుకున్న స్థానిక వీఎస్ఎన్ సిద్దార్థ స్మార్ట్ కిడ్స్ విద్యార్థులకు గురువారం ఆమె సర్టిఫికెట్లు, మెడల్స్ ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పిల్లల మనోవికాసానికి, సంకల్పసిద్ధికి యోగా ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో వీఎస్ఎన్ సిద్దార్థ విద్యాసంస్థల అధినేత్రి మాధవి, స్మార్ట్ కిడ్స్ ప్రిన్సిపాల్ పగడాల శోభారాణి, న్యాయసలహాదారుడు సుధాకర్, పాల్గొన్నారు.

వృద్ధులను మోసం చేస్తున్న వేల్ఫేర్ అసిస్టెంట్

● పింఛన్ పంపిణీలో అక్రమాలు

● ఎంపీడీవోకు ఫిర్యాదు

పెద్దతిప్పసముద్రం, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): పెద్దతిప్పసముద్రం మండలంలోని మల్లెల గ్రామ సచివాలయంలో వేల్ఫేర్ అసిస్టెంట్ అవినీతి బాగోతం వెలుగు చూస్తోంది. పింఛన్ల పంపిణీలో అవకతవకలకు పాల్పడుతున్నాడని, గత జూలై నుంచి ప్రతి నెల 1వ తేదీన పంపిణీ చేసే సమయంలో అత్యంత తెలివిగా డబ్బులు తక్కువగా ఉన్నాయని గ్రా మంలో ఐదారు మంది వృద్ధులకు సంబంధించి వేలిముద్రలు తీసుకుని డబ్బులు తర్వాత ఇస్తానని కాజేసినట్లు గురువారం స్థానిక సర్పంచ్ శ్రీకంఠరెడ్డితో పాటు గ్రామస్థులు ఎంపీడీవోకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ మల్లెల సచివాలయంలో పని చేస్తున్న వెల్ఫేర్ అసిస్టెంట్ గిరి ఒక నెలలో కొందరికి, మరో నెలలో మరికొందరికి ప్రతి నెల గుట్టుచప్పుడు కాకుండా పెన్షన్ డబ్బులను స్వాహా చేస్తున్నారని పలువురు వృద్ధులు ఆరోపిస్తున్నారన్నారు. ఈనెల అంకిరెడ్డిపల్లెకు చెందిన పాపిరెడ్డిగారి కనుగొండప్ప, కొటారి శ్రీరాములు వద్ద వేలిగుర్తులు తీసుకుని తర్వాత నగదు ఇస్తానని నమ్మబలికాడన్నారు. అయితే 17వ తేదీ అయినా ఆ వృద్ధులకు పెన్షన్ ఇవ్వలేదని వాపోయారన్నారు. ఈ విషయంపై గురువారం ఆయన గ్రామస్థులతో కలిసి ఎంపీడీవోకకు ఫిర్యాదు చేశారు. వేల్ఫేర్ అసిస్టెంట్‌పై తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

పచ్చదనం పెంచడానికి సీడ్‌బాల్స్ తోడ్పాటు



సీడ్‌బాల్స్ తయారు చేసే విధానాన్ని విద్యార్థినులకు వివరిస్తున్న ప్రిన్సిపాల్ కృష్ణవేణి

మదనపల్లె టౌన్, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): అడవుల్లో పచ్చదనం పెంచడానికి సీడ్‌బాల్స్ (విత్తన బంతులు) తోడ్పడతాయని ప్రిన్సిపాల్ కృష్ణవేణి పేర్కొన్నారు. గురువారం స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో వృక్షశాస్త్ర విద్యార్థినులతో సీడ్‌బాల్స్ తయారు చేయించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ సామాజిక బాధ్యత, పర్యావరణం పెంపొందించడానికి విద్యార్థినులను భాగస్వామ్యం చేస్తున్నామన్నారు. మదనపల్లె చుట్టుపక్కల అటవిప్రాంతంలో పచ్చదనం తక్కువగా వున్న ప్రాంతాలను గుర్తించి, అటవీఅధికారుల సహకారంతో ఆ ప్రాంతాల్లో సీడ్‌బాల్స్‌ను వేస్తామన్నారు. కార్యక్రమంలో వృక్షశాస్త్ర అధ్యాపకురాలు లక్ష్మిదేవి, ఎకోక్లబ్ కన్వీనర్ కుసుమ, అధ్యాపకులు జ్యోతి, విష్ణుప్రియ, మోహనవల్లి, గురుమూర్తి, సూర్యశేఖర్‌రెడ్డి, వనజ తదితరులు పాల్గొన్నారు.

చిరుత మృతికి కారణమైన అధికారులపై చర్యలు తీసుకోవాలి

మదనపల్లె టౌన్, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): వేటగాళ్ల ఉచ్చులో చిక్కుకున్న చిరుతను కాపాడటంలో విఫలమైన అటవీశాఖ అధికారులపై చర్యలు తీసుకోవాలని బహుజన యువసేన అధ్యక్షుడు పునీత్ డిమాండ్ చేశారు. గురువారం స్థానిక సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్‌ను కలసి ఈ మేరకు వినతిపత్రం ఇచ్చారు. అనంతరం పునీత్ మాట్లాడుతూ వేటగాళ్ల ఉచ్చులో చిరుత చిక్కుకుందని ఉదయం 7గంటలకే గ్రామస్థులు అటవీశాఖ అధికారులకు సమాచారమిచ్చినా, నింపాదిగా 9.30గంటలకు సంఘటనా స్థలానికి వచ్చారన్నారు. అంతేకాకుండా రక్షించే చర్యలు చేపట్టాల్సి వున్నా ఆలసత్వం ప్రదర్శించారన్నారు. ఈ కారణం చేతనే చిరుత మృతి చెందిందని, దీనికి కారకులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో బీవైఎస్ నాయకులు జిలాని, శ్రీనివాసులు, వినయ్, బాలకృష్ణ, ద్వారక తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి బిల్లులు వెంటనే విడుదల చేయాలి

● ఎంపీడీవో కార్యాలయం ఎదుట సీపీఐ ధర్నా

ములకలచెరువు, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ఉపాధి హామీ పథకం బిల్లులు వెంటనే విడుదల చేయాలని సీపీఐ మండల ప్రధాన కార్యదర్శి అంజనప్ప డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం స్థానిక ఎంపీడీవో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 11 వారాలుగా ఉపాధి బిల్లులు చెల్లించకపోవడంతో కూలీలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం నియోజకవర్గ కార్యదర్శి మల్లికార్జున, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు నిజాముద్దీన్, సీపీఐ నాయకులు ఉత్తన్న, సుబ్బన్న, నాగమల్లు, ము. కదిరప్ప, ఎల్లప్ప, రమేష్, శంకరమ్మ తదితరులు పాల్గొన్నారు.

'రాజ్యాంగ వ్యవస్థను కూల్చడానికి ఎన్డీఏ కుట్ర'

మదనపల్లె అర్బన్, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ వ్యవస్థలను కూల్చడానికే ఎన్డీఏ ప్రభుత్వం కుట్ర పన్నుతోందని మాలమహానాడు జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ యమాల సుదర్శనం అన్నారు. గురువారం స్థానిక మాలమహానాడు కార్యాలయంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ విషయంలో చంద్రబాబు నాయుడు ఏకపక్ష ధోరణిలో వ్యవహరించడం బాధాకరమన్నారు. ముఖ్యమంత్రి ఒకే కులానికి మద్దతు ఇవ్వడం ధర్మం కాదన్నారు. మాల సామాజిక వర్గానికి చెందిన ప్రజాప్రతినిధులు ఎస్సీ వర్గీకరణపై స్పందించకపోవడం దారుణమన్నారు. కార్యక్రమంలో నాయకులు యమాల చంద్రయ్య, గుండామనోహర్, వీరనాల మాణిక్యం, మోహన్, జయశంకర్, గంగరాజు, గంగాధర్ పాల్గొన్నారు.

దళితుల అభివృద్ధికి చంద్రబాబు పెద్దపీట

ములకలచెరువు, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): దళితుల అభివృద్ధి, సంక్షేమానికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పెద్దపీట వేస్తున్నారని టీడీపీ రాజంపేట పార్లమెంటు మహిళా కార్యదర్శి గంగాదేవి, నాయకులు రెడ్డెప్ప, సిద్దిగాళ్ల ప్రసాద్ అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో గురువారం వారు విలేకరులతో మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణకు కూటమి ప్రభుత్వం ఆర్డినెన్స్ జారీ చేయడం హర్షనీయమన్నారు. సమావేశంలో కదిరినాధునికోట గ్రామ కమిటీ అధ్యక్షుడు నరసింహులు, నాయకులు శివ, రెడ్డెప్ప తదితరులు పాల్గొన్నారు.

కూటమితోనే దళితుల అభివృద్ధి సాధ్యం

వాల్మీకిపురం, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వంతోనే దళితుల అభివృద్ధి సాధ్యమని, ఎస్సీ వర్గీకరణకు కేబినేట్ ఆమోదం తెలపడం పట్ల తామంతా స్వాగతిస్తున్నామని టీడీపీ రాజంపేట ఎస్సీ సెల్ అధ్యక్షుడు గాంధీపేట రమణ పేర్కొన్నారు. గురువారం వాల్మీకిపురంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణకు కేబినెట్ ఆమోదం తెలపడం, త్వరలోనే విడుదల చేయనున్న డీఎస్సీ నోటిఫికేషన్‌తో విద్యా, ఉద్యోగాలలో సమాన రిజర్వేషన్లు అందేలా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుండడం శుభపరిణామమన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కురబ కార్పొరేషన్ డైరెక్టర్ వల్లిగట్ల వెంకటరమణ, మార్కెట్ కమిటీ చైర్మన్ చంద్రమౌళి, పార్టీ మండల అధ్యక్షుడు మల్లికార్జునరెడ్డి, నాయకులు రాజేంద్రాచారి, పీవీ నారాయణ, గాంధీపేట రెడ్డి, రమేష్, రెడ్డిరాం, రెడ్డెప్ప తదితరులు పాల్గొన్నారు.

హజ్ కమిటీ రాష్ట్ర సభ్యుడిగా ఖాదర్‌ఖాన్

● కష్టపడిన వారికే టీడీపీలో గుర్తింపు : ఎమ్మెల్యే

మదనపల్లె టౌన్, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): హజ్ కమిటీ రాష్ట్ర సభ్యుడిగా మదనపల్లెకు చెందిన పఠాన్ ఖాదర్‌ఖాన్‌ను ప్రభుత్వం నియమించడంపై ఎమ్మెల్యే షాజహాన్‌బాషా హర్షం వ్యక్తం చేశారు. గురువారం ఎమ్మెల్యే నివాసం వద్ద పఠాన్ ఖాదర్‌ఖాన్‌ను ఎమ్మెల్యేతో పాటు టీడీపీ నాయకులు సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ టీడీపీలో విధేయతగా వుంటూ, పార్టీ బలోపేతానికి కష్టపడిన వారికి ప్రాధాన్యత ఇస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఉన్నత పదవులు అందిస్తున్నారన్నారు. కార్యక్రమంలో టౌన్‌బ్యాంకు చైర్మన్ విద్యాసాగర్, టీడీపీ నాయకులు నాదెళ్ల శివన్న, ఎస్ఆర్ షంషీర్, సహదేవ, సుధాకర్, జేసీబీ మధు, మున్నా, పూలకుంట్ల హరి, జీవీ నాయుడు తదితరులు పాల్గొన్నారు.



పఠాన్ ఖాదర్‌ఖాన్‌ను అభినందిస్తున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా